# భవిష్యత్ ప్రజాపాలన

మా వార్త రేపటి భవిష్యత్తుకు నిదర్శనం

తెలుగు దినపత్రిక

ASN NEWS

bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in

ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 75 శుక్రవారం , ఏప్రిల్ 17 , 2026 , పేజీలు - 12 వెల : 1 /-


## మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- బొలెరోను ఢీకొన్న రెడీమిక్స్ వాహనం
- ప్రమాదంలో 8మంది మృతి..పలువురికి గాయాలు
- మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు



**కర్నూలు,ఏప్రిల్ 16 :** కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే మిగతా2లో...

## మహిళా బిల్లుతో
# చరిత్ర సృష్టిద్దాం


● ఇందులో ఎలాంటి రాజకీయం లేదు ● 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు ● వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత ● చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం ● ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు ● ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది ● దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు ● ఉత్తరాది, దక్షిణ్యాది అంటూ విభజన తేవద్దు ● డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు ● మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 :** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ పక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రాకి అన్యాయం జరగదు మిగతా2లో...

## దేశవ్యాప్తంగా మండుటెండలు

- అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 ):** దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమండుతున్నాడు. మధ్యాహ్నం బయట తిరగా లంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగతా2లో...

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి


- ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి
- ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్
- అమెరికా పెట్టుబడిదారులకు తెలయి చేయండి
- అమెరికన్ నేషనల్ వార్ కాలేజీ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,ఏప్రిల్ 16 :** తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమ య్యారు.యంగ్ ఇండియా స్కిల్ మిగతా2లో...

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు
# హైకోర్టు నోటీసులు

- మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం.. విచారణ జూన్ 6కు వాయిదా



**హైదరాబాద్,ఏప్రిల్ 16 :** పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన కేసులో ఫిరాయింపుదారులుగా చెబు తున్న వాళ్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఫిరాయింపుదారులు కాదంటూ స్పీకర్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మిగతా2లో...

## డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

- ఉత్తరాది దక్షిణాది అంటూ విభజన రేఖలు
- మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు






## తెలంగాణలో 17 నుంచి 26కు
# ఎంపిల సంఖ్య

- ఎపిలో 25 నుంచి 38కి పెరుగుదల
- డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి
- దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 :** డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై మిగతా2లో...

## మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

- ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు
- మండిపడ్డ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్ 16 :**పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ -పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు.

మిగతా2లో...



## రాజ్యసభ సభ్యులుగా సింఘ్వీ, వేం ప్రమాణం

**హైదరాబాద్,ఏప్రిల్ 16 :** తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి గురువారం పార్లమెంట్ భవనంలో రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల గురించి వాణి వినిపిస్తానని చెప్పారు. నరేందర్‌రెడ్డికి మంత్రులు సీతక్క, శ్రీహరి అభినందనలు తెలిపారు.

## తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

- వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే
- దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా
- జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు



**హైదరాబాద్,ఏప్రిల్ 16 :**తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి మిగతా2లో...

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్లవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

# డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

**హైదరాబాద్,ఏప్రిల్ 16** కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుఆరోపించారు. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచం దర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చా ట్‌గా మాట్లాడారు.గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తు న్నారని ప్రశ్నించారు. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ. కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి. సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా జనాభా ఉన్న రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ చేయాలని రాహుల్ గాంధీ కొత్త పార్లమెంట్ భవనంలోనే కోరారు. ఇప్పుడు 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్పే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాహుల్ గాంధీకి మించి రేవంత్ జాతీయ నాయకుడిగా ఎదుగుతున్నారు. రాహుల్ గాంధీకి స్జబెక్ట్ తెలియక మాట్లాడటం లేదా? రేవంత్‌కు స్జబెక్ట్ ఎక్కువ ఉండి మాట్లాడుతున్నారా? డీలిమిటేషన్‌ను ముందు వ్యతిరేకించింది స్టాలిన్. రేవంత్‌రెడ్డి మాత్రమే దక్షిణాది, ఉత్తరాది అని వైషమ్యాలు సృష్టిస్తున్నారు. తెలంగాణలో 50 శాతం సీట్లు పెరిగితే.. యూపీలో 50 శాతం పెరుగుతాయి. దక్షిణాదిలో సీట్లు గతంలోనే తగ్గాయి.. ఇప్పుడు తగ్గుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు. మా గల్లీలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్ రాలేదు. ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే భాజపాకే ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్నాయి. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ది పొందడానికే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత పెడితే యూపీ ఎన్నికలు అంటారు.. ఆ తర్వాత పెడితే తెలంగాణ ఎన్నికలు అంటారు. అందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వస్తే మంచిదని రామచందర్ రావు అన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి



(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా,తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్ మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో

# మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రులు భరత్, జనార్ధన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

# దేశవ్యాప్తంగా మండుటెండలు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పుల కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పు లు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి. లైట్ కలర్ దుస్తులు ధరించండి. తరచుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. వడదెబ్బ తగిలితే .. వెంటనే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించండి. నేలపై పడుకోబెట్టండి. నీళ్లలో తడిపిన బట్టను కప్పండి. చల్లని నీళ్లు తాగించండి. నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాపదార్థాలను అతడికి తినిపించండి' అని సూచించింది. ఏప్రిల్ 20వ తేదీ వరకు తెలంగాణ, రాయలసీమ, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వా డా, ఉత్తర కర్ణాటక, మధ్య ప్రదేశ్, విదర్భ, ఒడిశా, జార్ఖండ్, వెస్ట్ రాజస్థాన్‌లలో అత్యంత తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది.

# తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపిల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన పక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

నోటీసులో తెలిపింది. ఆ తర్వాత కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశిం చింది. విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరఫున ఎంపికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం కడియం, శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, యాదయ్య, కృష్ణమోహన్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకటరావు, సంజరుకుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పులను సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజరు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్.ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు వేశారు. వీటిని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

# మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టు కుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేక పోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని , లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

# తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

(మొదటి పేజీ తరువాయి)

పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ తప్పనిసరి

**---స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా జర్నలిస్టుల సమస్యల ప్రస్తావనపైసానుకూలంగా స్పందించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి.**







**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** నూతనంగా అక్రిడేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు తప్పనిసరిగా అక్రిడేషన్ అందేలా చర్యలు చేపడతామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాదులో జరిగిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి విజయ్ కుమార్, సురేష్ కుమార్ హాజరై నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించిన రెండు ప్రధాన సమస్యలను రాష్ట్ర నాయకత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీకి వినతిపత్రాలు అందజేయడంతో పాటు సభా వేదికపై నుంచే సమస్యలను వివరించారు.మొదటి సమస్యగా కల్వకుర్తి ప్రాంతానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అక్రిడిటేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో రంగారెడ్డి జిల్లా చూపిస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన నాయకులు ఇది టెక్నికల్ సమస్య అని, రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అలాగే నల్లమల్ల ప్రాంతంలోని మన్ననూరు, బ్రహ్మగిరి కేంద్రాలో మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించి కమిషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ వేదికపై నుంచి స్పష్టమైన హామీ ఇచ్చారు.ఈ నేపథ్యంలో మీడియా మిత్రులు ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా అధ్యక్షుడు పి. విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఆర్. సురేష్ కుమార్ తెలిపారు.

# జిల్లా ఓల్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్ లో ప్రజా పాలనలో భాగంగా EYE CAMP

**-- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్ భవిష్యత్ ప్రజాపాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :**
ప్రజా పాలనలో భాగంగా జిల్లాలో ఉన్న డ్రైవర్లు అందరికీ అరైవ్ అలైవ్ ప్రోగ్రాం లో భాగంగా జ్‌జు జూవ్రీ నిర్వహించిన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ నాగర్ కర్నూల్ జిల్లా ఓల్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్ నందు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గారి ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ ప్రోగ్రాంలో భాగంగా జ్‌జు క్యాంపు జిల్లాలో ఉన్న డ్రైవర్లు అనగా లారీ డ్రైవర్లు ఆటో డ్రైవర్లు మరియు ఇతర డ్రైవర్లు అందరికీ కన్ను క్యాంప్ నిర్వహించడం జరిగింది , ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ మన భారతదేశంలో యాక్సిడెంట్లు ఎక్కువగా అయి డ్రైవర్లు మరియు ప్రయాణికులు చనిపోతున్నారు కావున దీనిలో ఒక కారణం మీ యొక్క కంటి చూపు కూడా కావచ్చు అని మీరు అందరూ ఈ పోలీస్ శాఖ నిర్వహించిన ఐ క్యాంప్లో మీయొక్క కన్నుల టెస్టులను చేసుకుని దానికి తగిన చికిత్స తీసుకొని మీ యొక్క ఆరోగ్యాన్ని మరియు మీ జీవితాన్ని కాపాడుకోవాలని తెలిపారు , అలాగే ఈ



కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో సగటున ప్రతి నాలుగు నిమిషాలకు ఒక్క రోడ్డు ప్రమాదం జరుగుతుందని, వీరిలో ఎక్కువ శాతం యువత మృతి చెందుతున్నారని, ప్రతి ఒక్కరు బాధ్యతగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు.వాహనం నడిపే వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, రాంగ్ రూట్లో, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపకూడదని తెలిపారు.అలాగే వాహనం నడిపేటప్పుడు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని బాధ మిగులుతుందని, రోడ్డు భద్రత నియమాలు పాటించి వాహనాలు నడిపితే కొంతవరకైనా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ సిఐ అశోక్ రెడ్డి , డిసిఆర్బిసిఐ ఉపేంద్రరావు ,=× జగన్ ఎస్సై గోవర్ధన్ , ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కళ్యాణ్ ,ప్రశాంత్ నాగర్ కర్నూల్ ఆర్టీవో ఆఫీసర్స్ రమేష్ రెడ్డి తోపాటు డ్రైవింగ్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ ఆఫీసర్స్ అందరూ అందరూ పాల్గొనడం జరిగింది.

# చంద్రధన గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమం





**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన**
రైతులకు ఆదాయవృద్ధి దిశగా కీలక మార్గదర్శనంచంద్రధన గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతులు పెంటారెడ్డి, సాయి రెడ్డి వారి ఆయిల్ పామ్ తోటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఈరోజు ఆయిల్ పామ్ సాగు, పెంపకం, నిర్వహణపై విస్తృత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిచయం చేయడం, అధిక దిగుబడులతో స్థిరమైన ఆదాయం సాధించేందుకు మార్గాలు చూపడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిలిచింది.ఈ కార్యక్రమానికి ఉద్యాన పట్టు పరిశ్రమ ఏపీ డి కిషన్ రావు, హెచ్ ఓ హిమబిందు, ప్రముఖ ఆయిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్ మోహన్ రావు, తలకొండపల్లి మండలం ఉద్యాన శాఖ ఇంచార్జ్ సీతారాం, గ్రామ ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సొల్లు సుధాకర్, బదునాపూర్ వార్డు సభ్యులు లక్ష్మీకాంత్ గౌడ్, జిల్లా అధికారి ప్రమోద్ కుమార్, మండల శాఖ అధికారులు కొండల్ రెడ్డి తదితరులు పాల్గొని రైతులకు ప్రత్యక్షంగా మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్లో ఆయిల్ పామ్ పంట రైతులకు లాభదాయకమైన దీర్ఘకాలిక వాణిజ్య పంటగా ఎదుగుతోందని పేర్కొన్నారు. తక్కువ శ్రమతో, సాంకేతిక పద్ధతులను అనుసరించడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని వివరించారు. సరైన ప్రణాళికతో సాగు చేస్తే రైతులు సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయాన్ని పొందగలరని నొక్కిచెప్పారు.కార్యక్రమంలో భాగంగా ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన నేల లక్షణాలు, మొక్కల నాటే సరైన దూరం, నీటి వినియోగం, ఎరువుల సమతుల్య వినియోగం, పంట సంరక్షణ వంటి అంశాలపై సవివరంగా చర్చించారు. ముఖ్యంగా డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ వంటి ఆధునిక పద్ధతులు నీటి పొదుపుతో పాటు దిగుబడిని పెంచడంలో ఎంతగానో ఉపయోగపడతాయని ప్రాక్టికల్‌గా వివరించారు.అలాగే, పంటకు వచ్చే వ్యాధులు, పురుగుల నివారణకు సమయానుకూల చర్యలు తీసుకోవడం, తోటల పరిశుభ్రతను కాపాడటం, నాణ్యమైన నాట్లను మాత్రమే ఉపయోగించడం వంటి అంశాలపై రైతులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులతో సంప్రదింపులు జరిపితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. మార్కెట్ అవకాశాల విషయానికి వస్తే, ఆయిల్ పామ్ పంటకు నిరంతర డిమాండ్ ఉండటంతో రైతులకు ధరలపై భరోసా ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, సబ్సిడీలు, సాంకేతిక సహాయం ద్వారా రైతులు ప్రారంభ దశలోనే మంచి మద్దతు పొందగలరని చెప్పారు. ఆయిల్ కంపెనీలతో అనుబంధం కలిగి ఉంటే పంట కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ఎంతో ఆసక్తిగా పాల్గొని వివిధ అంశాలపై అధికారులను ప్రశ్నిస్తూ తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ముఖ్యంగా కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలనుకునే రైతులకు ఈ అవగాహన కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారింది.చివరగా అధికారులు రైతులకు పిలుపునిస్తూ, సంప్రదాయ పంటలతో పాటు లాభదాయకమైన వాణిజ్య పంటలను స్వీకరించి ఆధునిక సాంకేతికతను అనుసరించడం ద్వారా ఆర్థికంగా బలపడాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా చంద్రధన గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతుల్లో ఆసక్తి పెరగడంతో పాటు, భవిష్యత్తులో ఈ పంట విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# నాగర్ కర్నూల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు ఘన సన్మానం



**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :**
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు తాజా ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి కళాశాలకు గౌరవాన్ని తెచ్చారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సుప్రజాత ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అధ్యాపకుల సమక్షంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు భవిష్యత్తులో దృఢ సంకల్పంతో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలని సూచించారు. అలాగే తమ తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఇదే సమయంలో తక్కువ మార్కులు సాధించిన మరియు ఫెయిల్ అయిన విద్యార్థులు ఏప్రిల్ 20, 2026 సాయంత్రం 5 గంటలలోపు కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎర్రబెల్లి...



**భవిష్యత్ ప్రజాపాలన ఏప్రిల్ 16:**
జనగామ జిల్లా పాలకుర్తి పట్టణ కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి డెకరేషన్ ఁ టెంట్ హౌస్ అధినేత, దయన్న అభిమాని రేపాల అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు.. తీవ్రమైన ఎండాకాలంలో బాటసారుల దాహాన్ని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అనేది చాలా మంచి ఆలోచన అన్నారు.. గత 11 సంవత్సరాలుగా విజయవంతంగా చల్లటి నీటిని బాటసారులకు అందించడం అభినందనీయమన్నారు.. అనంతరం రేపాలఅశోక్ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు....ఈ కార్యక్రమంలో దీ=హా పార్టీ మండల అధ్యక్షులు పసునూరి.నవీన్ కుమార్, మాజీ జడ్పిటీసీ పుస్కూరి.శ్రీనివాస రావు, పాలకుర్తి మేజర్ గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ గాదేపాక.కిరణ్ లతో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, బాటసారులు, మహిళలు పాల్గొన్నారు...

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన**
ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన... రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి -- కల్వకుర్తిప్రజా పాలనను బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం కింద కడ్తాల్ మండల స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ... ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల నుండి ప్రత్యక్షంగా అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకునే వేదికగా ఈ సమావేశాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
రోడ్డు భద్రతపై అవగాహన " థీమాటిక్ వారంలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. ముఖ్యంగా యువత నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు.
కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీఈ సందర్భంగా మైసిగండి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయం అందజేశారు. కేతావత్ లక్ష్మి, రామావత్ హీరా, ఆంగోత్ సుజాతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు అందజేయడం జరిగింది. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు





ఆర్థిక భారం తగ్గుతుందని ఎమ్మెల్యే తెలిపారు.
ప్రజాప్రతినిధుల పాల్గొనడంఈ కార్యక్రమంలో మైసిగండి సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఉప సర్పంచ్ హీరాసింగ్ నాయక్‌తో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.మండల స్థాయిలో ఇలాంటి సమావేశాలను తరచుగా నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరగా పాలన తీసుకెళ్లడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రజా పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతఅభివృద్ధికి దారి చూపుతాయని వారు పేర్కొన్నారు.

# శంకర్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ దయనీయ పరిస్థితి -- ప్రయాణికుల ఆగ్రహం

- కనీస వసతులు లేక అవస్థలు.. ఆక్రమణలు,
- అస్వచ్ఛతతో పాటు రాత్రివేళ వెలగని లైట్లు

నెలనెలా లక్షల్లో ఆదాయం ఉన్నా అభివృద్ధి మాత్రం శూన్యం














**శంకర్‌పల్లి ఏప్రిల్ 16 భవిష్యత్ ప్రజాపాలన :-** శంకర్‌పల్లి మండలంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటి ప్రభావం ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. కూర్చోవడానికి సరిపడా బెంచీలు లేక ప్రయాణికులు చెట్ల కింద సేద తీరాల్సిన పరిస్థితి నెలకొంది.బస్టాండ్ పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ మలమూత్ర విసర్జనలు జరుగుతుండటంతో తీవ్ర అస్వచ్ఛత నెలకొంది. షటర్ల ముందు ఆక్రమణలు పెరిగిపోవడంతో ప్రయాణికులకు సౌకర్యంగా సంచరించే అవకాశమే లేకుండా పోయింది. ఈ సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, డిపో మేనేజర్ స్పందించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇక బస్టాండ్‌లోపలికి బస్సులు ప్రవేశించే మూల మలుపు వద్ద ఆక్రమణలు పెరగడంతో బస్సు డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.అదేవిధంగా, బస్సుల రాకపోకలకు సంబంధించిన సమాచారం ఇవ్వాల్సిన బోర్డులు ఉండాల్సిన ప్రదేశాల్లో వాణిజ్య ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల బస్సుల వివరాలు తెలుసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు.రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. బస్టాండ్‌లో సరైన విద్యుత్ వెలుతురు లేకపోవడంతో లైట్లు వెలగక చీకటి కమ్మేస్తోంది. దీని వల్ల ప్రయాణికులు భయాందోళనలకు గురవుతూ, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.ఇంతటి సమస్యలు ఉన్నప్పటికీ, బస్టాండ్ ద్వారా నెలనెలా లక్షల్లో ఆదాయం వస్తోందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఆ ఆదాయానికి తగిన అభివృద్ధి మాత్రం కనిపించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను కిరాయికి ఇచ్చి ఆదాయం పొందడంపైనే దృష్టి పెట్టి, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషన్ల వ్యవహారంలో డిపో మేనేజర్ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వెంటనే ఆక్రమణలను తొలగించి, శుభ్రత చర్యలు చేపట్టి, సరైన లైటింగ్ ఏర్పాటు చేసి, అదనపు బెంచీలు ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు ఇబ్బందులు లేకుండా మార్గాలను సరిచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రహదారులపై ధాన్యం తొలగించాలి:ఎస్ ఐ పవన్ కుమార్ ప్రజలకు సూచన



**భవిష్యత్ ప్రజాపాలన ఏప్రిల్ 16:** పాలకుర్తి మండలంలోని ఎస్ ఐ పవన్ కుమార్ ప్రజలకు రహదారులపై ధాన్యం (వడ్లు) ఆరబెట్టడం వలన వాహన రాకపోకలకు అంతరాయం కలిగి, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గమనించబడింది.ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు చర్యల భాగంగా, రహదారులపై ధాన్యం ఆరబోసిన రైతులకు నోటీసులు జారీ చేయడమైనది. వారు వెంటనే రహదారులపై ఉన్న ధాన్యాన్ని తొలగించవలెను.ఈ ఆదేశాలను పాటించని పక్షంలో సంబంధిత వ్యక్తులపై దీచీూా చట్టంలోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడునుప్రజలందరూ సహకరించి రోడ్డు ప్రమాదాలు నివారించడంలో భాగస్వాములు కావలసిందిగా కోరుతున్నాము..

## దేవరకొండ. ఏసీబీ వలలో విద్యుత్ ఏడీఈ




**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య**
నల్లగొండ జిల్లా దేవరకొండ లో లంచం డిమాండ్ చేసిన దేవరకొండ విద్యుత్ శాఖ ఏడీఈ సైదులు గురువారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఓ పనికి సంబంధించిన ఫైలును క్లియర్ చేసేందుకు ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.30 వేలు తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేసి రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో నిఘా పెట్టిన ఏసీబీ బృందం.. నగదు స్వాధీనం చేసుకుని ఏడీఈని అదుపులోకి తీసుకుంది. కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయి.

## ఆర్ఎంపీ,పీఎంపీలను తనిఖీలు చేసిన దొంగ డాక్టర్ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు



**భవిష్యత్ ప్రజాపాలన ఏప్రిల్ 16:** ఆర్ఎంపీ,పీఎంపీలను తనిఖీలు చేసిన దొంగ డాక్టర్ ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు పాలకుర్తి సీఐ వి.జానకిరామిరెడ్డి బుధవారం రాత్రి దేవరుప్పుల మండల పోలీస్ స్టేషన్ లో ఎస్సై ఊర సృజన్ కుమార్ తో కలిసి ముఠాసభ్యులు ఐదుగురిని చూపించి వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా డాక్టర్ సెల్ మెడికల్‌డహెల్త్ వింగ్ విభాగానికి చేర్యాలలో అక్షర హాస్పిటల్ ను నిర్వహిస్తున్న డాక్టర్.ఎడెల్లి సంతోష్ కుమార్ ను జనగామ జిల్లా చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ నియమించింది.అయితే జనగామ జిల్లా వ్యాప్తంగా కమిటీ వేసి 44 మందిని సంతోష్ కుమార్ నియమించుకున్నాడు.అందులో యాక్టివ్ గా ఉన్న ఇంతకుముందు అతని వద్ద పనిచేసిన సింగపాక మనోజ్ అనే వ్యక్తిని వైస్ చైర్మన్ గా నియమించారు.సంఘీ నాగరాజు (బంజర-దేవరుప్పుల),కందుకూరి హరీశ్ (జనగామ),రంగు భానుచందర్ (తమ్మడపల్లి-బచ్చన్నపేట),ఉప్పల అనిల్ (దేవరుప్పుల)ను సభ్యులుగా నియమించారు.డాక్టర్స్ సెల్ విభాగంలో పనిచేస్తే మీకు భవిష్యత్ ఉంటుందని వారికి చెప్పారు.మీరు ప్రభుత్వ,ప్రైవేట్ హాస్పిటల్,ఆర్ఎంపీ,పీఎంపీ క్లినిక్ ల్లో తనిఖీలు చేపట్టి అందులో ఏమైనా లోపాలుంటే అక్కడ పంచనామా రాసి కేసు అవుతుందని బయపెట్టాలని చెప్పాడు.దీంతో కమిటీ సభ్యులు డబ్బులకు ఆశపడి జనగామలో ఓ ఆర్ఎంపీ ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల ఓ వ్యక్తి చనిపోగా అతడి వద్దకు వెళ్లి బెదిరించారు.దీంతో సదరు ఆర్ఎంపీ కుమారుడు రూ.30 వేలు ఇచ్చాడు.అందులో నుంచి రూ. 4వేలు డాక్టర్ సంతోష్ కుమార్ చెప్పిన నెంబర్ కు గూగుల్ పే ద్వారా మనోజ్ పంపారు.మిగతా డబ్బులు వారు సమానంగా పంచుకున్నారు.ఇలా పలుచోట్ల అక్రమాలకు పాల్పడ్డారు.ఈ విషయమై దేవరుప్పుల,జనగామ పీఎస్ లో కేసులు నమోదయ్యాయి.ఈ విషయమై పోలీసులు గాలింపు చర్యలు చేపట్టాగా బుధవారం రెండు కార్లలో దేవరుప్పుల వైపు వస్తుండగా ఐదుగురిని అరెస్ట్ చేసి రెండు కార్లతోపాటు ఐదు సెల్ఫోన్లు,రూ. 43 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.కాగా కందుకూరి హరీశ్ పరారీలో ఉన్నట్లు వివరించారు. అరెస్టు అయిన డాక్టర్ సంతోష్ కుమార్ తోపాటు నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లను జనగామ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ అయినట్లు సీఐ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై సామూహిక బాధ్యతతో ముందుకు రావాలి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి

- గ్రామస్థాయి నాయకత్వంతో రోడ్డు భద్రతలో మార్పు,

అరైవ్ అలైవ్' వారోత్సవాల్లో విస్తృత అవగాహన

- డ్రైవర్లకు కంటి పరీక్షలు ప్రమాదాల నివారణకు కీలక చర్య





**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి అవినాష్:** యువతలో సానుకూల మార్పు తీసుకురావడంలో గ్రామస్థాయి నాయకత్వం కీలకమని సర్పంచులు ముందుండి యువతను సరైన దిశలో నడిపించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా 4వ రోజు గురువారం గోపాల్ పేట్ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఆధ్వర్యంలో గోపాల్ పేట్ మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మహిళలతో రోడ్డు భద్రత అవగాహన గురించి నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి గారు, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ గారితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. అనంతరం జిల్లా రవాణాశాఖ మరియు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆటో, ట్రాక్టర్ మరియు ఇతర వాహన డ్రైవర్లకు మండల పరిషత్ కార్యాలయంలో కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. డ్రైవర్ల కంటి పరీక్షలు నిర్వహించి, ప్రమాదాలకు దారి తీసే దృష్టి లోపాలను గుర్తించారు.కార్యక్రమం ముగింపులో జిల్లా రవాణాశాఖ సహకారంతో డ్రైవర్లకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి గారు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుంది. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం వంటి చిన్న చర్యలు ప్రాణాలను కాపాడగలవు ప్రభుత్వం చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించి, రోడ్డు నియమాలను కచ్చితంగా పాటించాలి డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితులు కూడా సురక్షిత ప్రయాణానికి కీలకం."ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించాలంటే ప్రజల్లో అవగాహన పెరగాలి. డ్రైవర్లు, ప్రయాణికులు ట్రాఫిక్ నియమాలను పాటించడం అత్యంత అవసరం ముఖ్యంగా హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రజలు సమర్థంగా వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరావు, డిటిఓ మానస, మండల ప్రత్యేక అధికారి, డివైస్ ఓ,సుధీర్ రెడ్డి,వనపర్తి సిఐ సుగంధ రత్నం, గోపాల్పేట్ ఎమ్మార్వో, తిలక్ రెడ్డి, ఎంపిఓ,భవాని, ఎస్సై, జగన్, సర్పంచ్ స్వప్న, నాయకులు యాదయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో బిజినపల్లి,తిమ్మాజిపేట సర్పంచులకు ఘన సన్మానం..




**బిజినపల్లి: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నాడు ఇటీవల నూతనంగా ఎంపికైన ప్రజాప్రతినిధులు గ్రామ సర్పంచులను క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువలతో ఘనంగా సన్మానించినట్లు క్లబ్ జిల్లా అధ్యక్షులు నాగం చంద్రమోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు గాడి సురేందర్ రెడ్డి తెలిపారు.ఈసందర్భంగా క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాస రాఘవేందర్ మాట్లాడుతూ గ్రామాలలో సర్పంచులు సహకరిస్తే 365 రోజులపాటు 365 సేవ కార్యక్రమాలలోకోరిన గ్రామాలలో భాగస్వాములు అవుతామని అన్నారు. బిజినపల్లి,తిమ్మాజీపేట చెందిన 120 మంది సర్పంచ్ లు,ఇతర ప్రజాప్రతినిధులకు ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కతాలప్ప,ఎమ్మార్వో మునిరోదీన్, ప్రత్యేక అధికారి రాజేశ్వరి,క్లబ్ సభ్యులు రమణకుమార్,సూర్య కళ,పోల శ్రీనివాసులు, కేవీ ప్రసాద్,నాగిరెడ్డి, శ్రీనివాసచారి,సత్యం తదితరులు పాల్గొన్నారు.

## బబ్లూ ని ఆశీర్వదించిన మారబోయిన అనిల్ కుమార్ యాదవ్.



**భవిష్యత్ ప్రజాపాలన శేరిలింగంపల్లి.** శేరిలింగంపల్లి నియోజక వర్గం పాపిరెడ్డికాలనీకి చెందిన సోదరుడు భాస్కర్ చిన్న కుమారుడు బాబ్లు జన్మదిన సందర్భంగా స్థానిక కాలనీలోని సరస్వతి పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జన్మదిన వేడుకలలో ముఖ్యఅతిథిగా ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ పాల్గొని బాబ్లు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆశీర్వదించి అన్న ప్రసాద కార్యక్రమం లో స్వయంగా చిన్నారులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

# మంత్రి పదవి రేసులో ‘ బలన్నా!!

## సామాన్య కార్యకర్త:నారిమళ్ళ సైదులు



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య**

నల్లగొండ జిల్లా రాజకీయాల్లో కీలక మలుపు చోటుచేసుకోబోతోంది. వెనుకబడిన ప్రాంతంగా పేరున్న దేవరకొండ నియోజకవర్గానికి ఈసారి రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం దక్కబోతున్నట్లు తెలుస్తోంది. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కు మంత్రి పదవి దాదాపు ఖరారైందన్న వార్త ఇప్పుడు గిరిజన పల్లెల్లో పండుగ వాతావరణాన్ని తెచ్చింది.గిరిజన బిడ్డకు అరుదైన అవకాశంఉమ్మడి నల్లగొండ జిల్లాలో బలమైన గిరిజన నేతగా ఎదిగిన బాలు నాయక్, ప్రజలతో మమేకమయ్యే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఎస్టీ కోటాలో మంత్రి పదవి కోసం పలువురి పేర్లు పరిశీలనలోకి వచ్చినప్పటికీ, బాలు నాయక్ విధేయత, నియోజకవర్గంలో ఆయనకున్న పట్టు, మరియు సామాజిక సమీకరణలు ఆయనకు ప్లస్ పాయింట్‌గా మారాయి. అదిష్టానం కూడా ఆయన వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.నెరవేరనున్న నియోజకవర్గ ప్రజల కలదేవరకొండ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుండి ఇక్కడి నుంచి గెలిచిన వారికి మంత్రి పదవి దక్కడం అనేది ఒక తీరని కలగానే మిగిలిపోయింది. ఇప్పుడు బాలు నాయక్ రూపంలో ఆ కల సాకారం కాబోతుండటంతో స్థానిక ప్రజలు, కార్యకర్తలు ఆనందంలో మునిగిపోతున్నాం అని అన్నారు

# యువకుల స్వచ్ఛంద రక్తదానం

**-మాజీ కౌన్సిలర్ ఆలూరి నరేందర్ జన్మదినం సందర్భంగా సామాజిక సేవ**








**నాగర్ కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :**

మున్సిపల్ 16 వ వార్డు మాజీ కౌన్సిలర్,బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆలూరి నరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని యువకులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ లో గురువారం సంజయ్ నగర్ యువజన బృందం ఆధ్వర్యంలో రక్తదానం చేశారు.8 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా సంజయ్ నగర్ కాలనీకి చెందిన యువకులు జాకీర్ హుస్సేన్,మోహన్,దినేష్,సంపత్,వంశీ,సురేష్,సతీష్,బాబు లు మాట్లాడుతూ కౌన్సిలర్ గా ప్రజా నాయకుడిగా ఆలూరి నరేందర్ నిత్యం ప్రజల సంక్షేమం కోరుకునే వ్యక్తి అని ఆయన జన్మదినం సందర్భంగా నలుగురికి మేలు చేయాలన్న సంకల్పంతో మా నాయకుడు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి తమకు చూపిన సామాజిక బాధ్యతలో భాగంగా తాము స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు వారు తెలిపారు. తన పట్ల అభిమానంతో రక్తదానం చేసిన యువకులను ఆలూరి నరేందర్ అభినందించారు. సమాజంలో తమ కోసం కాకుండా నలుగురి సంక్షేమం కోసం పాటుపడాలని యువతకు సూచించారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. యువతకు సామాజిక బాధ్యత ఎంతో అవసరమని తద్వారా సమాజం బాగుపడుతుందన్నారు. సంజయ్ నగర్ యువత సామాజిక సేవతో స్ఫూర్తిగా నిలిచారన్నారు.తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఒక మంచి కార్యక్రమాన్ని చేపట్టిన యువకులను ఆయన అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.


# ‘ఉపాధి హామీలో రెండు పూటలా ఫొటో క్యాప్చర్ విధానం తీసేయాలి’

**కనగల్, ఏప్రిల్ 16 :** ఉపాధి హామీలో రెండు పూటలా ఫొటో క్యాప్చర్ విధానం తీసి వేయాలని, ఈ నెల 21 నుండి మండలాల ముందు జరుగు ధర్నాలో ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య పిలుపునిచ్చారు. గురువారం కనగల్ మండలంలోని లింగోటం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నోసంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు పనైనా చూపండి, తిండి అయినా పెట్టండి అనే నినాదంతో పోరాటాలు నిర్వహించిన ఫలితంగా 2005లో యూపీఏ-1 ప్రభుత్వంలో వామపక్ష పార్టీల ఒత్తిడి ఫలితంగా ఉపాధి హామీ సాధిస్తే 2014 నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీకి రోజురోజు బడ్జెట్‌లో కోతలు విధిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేటటువంటి చర్యలకు మోదీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు.

# జలయాగంలో అద్భుతం: 45 నిమిషాల పాటు నీటిపై తెలియడుతూ పద్మాసనం చేసిన చిన్నారి ‘వెన్నెల’



దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య




దేవరకొండ ప్రాంతంలో సముద్ర విజయ్ విహార్ స్విమ్మింగ్ పూల్ లో చిన్నారి వెన్నెల ఏకాదటిగా 45 నిముషముల పాటు నీటిలో పద్మసనం చేసి అందరిని అబ్బురపరిచింది. ఇది చుసిన తల్లి తండ్రులు వెన్నల ధైర్యసాహసాలు, పట్టుదలకు మంత్ర ముగ్గదులు అయ్యారు, తనుప్రముఖ స్విమ్మింగ్ శిక్షకులు కోచ్ శ్రీను గారి పర్యవేక్షణలో ఒక అద్భుతమైన జల విన్యాసం నేర్చుకొని సాధించానని తెలిపింది.ఎక్కడ పట్టు వదలకుండా కొన్ని సార్లు మునిగి పోయే పరిస్థితలో కూడా శ్వాస మరియు శరీరం పై సమన్వయం చూపుతూ అతి కొద్దీ రోజులలో దీనిని నేర్చుకున్నానని తెలియపరిచింది.ఈ సందర్భంగా కోచ్ శ్రీను గారు మాట్లాడుతూ:“వెన్నెల చిన్నప్పటి నుండి పట్టుదలతో శిక్షణ తీసుకుంటోంది. కేవలం శ్వాస నియంత్రణ మరియు ఏకాగ్రత ద్వారానే ఈ జల విన్యాసం సాధ్యమైంది. 45 నిమిషాల పాటు కదలకుండా నీటిపై పద్మాసనంలో ఉండటం సామాన్యమైన విషయం కాదు. తన ప్రతిభతో భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టిస్తుందని ఆశిస్తున్నాను” అని తెలిపారు.చిన్న వయసులోనే వెన్నెల చూపిన ఈ అద్భుత ప్రతిభను చూసి స్థానికులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

# దేవరకొండ దశాబ్దాల కల సాకారం.. మంత్రి పదవి రేసులో ‘బాలు నాయక్’!సర్పంచ్ ఎరుకల పార్వతి వెంకటేష్ గౌడ్

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య**



నల్లగొండ జిల్లా రాజకీయాల్లో కీలక మలుపు చోటుచేసుకోబోతోంది. వెనుకబడిన ప్రాంతంగా పేరున్న దేవరకొండ నియోజకవర్గానికి ఈసారి రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం దక్కబోతున్నట్లు తెలుస్తోంది. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కు మంత్రి పదవి దాదాపు ఖరారైందన్న వార్త ఇప్పుడు గిరిజన పల్లెల్లో పండుగ వాతావరణాన్ని తెచ్చింది. గిరిజన బిడ్డకు అరుదైన అవకాశం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బలమైన గిరిజన నేతగా ఎదిగిన బాలు నాయక్, ప్రజలతో మమేకమయ్యే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఎస్టీ కోటాలో మంత్రి పదవి కోసం పలువురి పేర్లు పరిశీలనలోకి వచ్చినప్పటికీ, బాలు నాయక్ విధేయత, నియోజకవర్గంలో ఆయనకున్న పట్టు, మరియు సామాజిక సమీకరణలు ఆయనకు ప్లస్ పాయింట్‌గా మారాయి. అదిష్టానం కూడా ఆయన వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.నెరవేరనున్న నియోజకవర్గ ప్రజల కల దేవరకొండ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుండి ఇక్కడి నుంచి గెలిచిన వారికి మంత్రి పదవి దక్కడం అనేది ఒక తీరని కలగానే మిగిలిపోయింది. ఇప్పుడు బాలు నాయక్ రూపంలో ఆ కల సాకారం కాబోతుండటంతో స్థానిక ప్రజలు, కార్యకర్తలు ఆనందంలో మునిగిపోతున్నాం అని అన్నారు.యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముకురోజు రాజు నారిమళ్ల సైదులుఅభివృద్ధిలో కొత్త శకం!మంత్రి పదవి దక్కితే, దేవరకొండ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులు, గిరిజన తండాల అభివృద్ధి మరియు నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. బాలు నాయక్ తనదైన శైలిలో జిల్లా రాజకీయాలను ప్రభావితం చేయగలరని, మంత్రిగా బాధ్యతలు చేపడితే నియోజకవర్గం రూపురేఖలు మారుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతానికి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నప్పటికీ, గాంధీ భవన్ వర్గాల సమాచారం ప్రకారం బాలు నాయక్ పేరు జాబితాలో ముందు వరుసలో ఉండటం ఖాయంగా కనిపిస్తోంది.ప్రజల ఆకాంక్ష.. మన బాలు నాయక్ :ఎరుకల పార్వతి వెంకటేష్ గౌడ్ సర్పంచాలు నాయక్ గారికి మంత్రి పదవి దక్కడం అంటే అది కేవలం ఒక వ్యక్తికి దక్కిన గౌరవం కాదు, యావత్ దేవరకొండ ప్రజల ఆకాంక్ష నెరవేరడమే. ఈ పదవితో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాం.అన్నారు ఈ కార్యక్రమంలో దేవరకొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముకురోజు రాజు మరియు నరిమళ్ళ సైదులు పాల్గొన్నారు

# మహేశ్వరం మండలంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక



మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన



మహేశ్వరం మండలంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక) కార్యక్రమం భాగంగా నిర్వహించిన సమావేశం విజయవంతంగా ముగిసింది. గురువారం కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు, మండల ప్రత్యేక అధికారి, నోడల్ అధికారి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలుపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు అందాల్సిన సేవలను పారదర్శకంగా, వేగవంతంగా అందించడంపై అధికారులు దృష్టి సారించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న మహేశ్వరం ఎంపీడీఓ శ్రీమతి పి. శైలజ రెడ్డి మాట్లాడుతూ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ పథకాలు ఫలితాలిస్తాయని అన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు.ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రత, తాగునీరు, విద్య, ఆరోగ్యం, పచ్చదనం వంటి రంగాల్లో గణనీయమైన మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి మహేశ్వరం మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని ఆమె పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు తమ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి ప్రభుత్వ సంకల్పాలను ప్రజలకు చేరవేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. మొత్తం కార్యక్రమం చురుకుగా, సమన్వయంతో సాగి విజయవంతమైంది.

# బస్తాల కొరతతో మొక్కజొన్న రైతన్నలు


**- లారీలు రాక మండుటెండలో పడిగాపులు: రైతులకు అండగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**- సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రైతుల బాదలు తెలిపిన ఎర్రబెల్లి**





**భవిష్యత్ ప్రజాపాలన ఏప్రిల్ 16:** పాలకుర్తి నియోజకవర్గం పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ మార్కెట్ యార్డ్ ని సందర్శించిన మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావుపాలకుర్తి నియోజకవర్గ పరిసర గ్రామాల రైతులు తమ పంట కొనడం లేదని మా దృష్టికి తీసుకురావడంతో పాలకుర్తి మార్కెట్ యార్డ్ కి రావడం జరిగింది.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకపోతోంది. సకాలంలో రైతుబంధు ఇవ్వకపోగా.. కనీసం పండిన పంటను మద్దతు ధరకు కొనే పరిస్థితిలో కూడా లేదు. ఇది ముమ్మాటికీ కాస్తున్నామని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఈ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలి.రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల్లో మక్కజొన్న పండితే, సగం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదు ప్రారంభం అయినవి కూడా సరిగా లారీలు లేక బస్తా సంచులేక రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. సంచులు లేవని, లారీలు సరిగా రావటం లేదని రైతులు తమ బాధ తెలపగా సంబంధిత అధికారులకు ఐవీ గారికి ఫోన్ చేయటం జరిగింది.మద్దతు ధర రూ. 2400 ఉంటే రూ. 1600-1700 కే అమ్ముకుని రైతులు మోసపోతున్నారు.
మొక్కజొన్నల కొనుగోలుపై ఈ ప్రభుత్వం ఇంతవరకు నిర్ణయమే తీసుకోలేదు. ఆరుగాలం కష్టపడ్డ రైతులు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకకు వెళ్లి సగం ధరకే జొన్నలు అమ్ముకునే దుస్థితి వచ్చింది. వడ్లు కూడా రోడ్ల మీదనే ఉన్నాయి.ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ లో ప్రతి పంటకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు బోనస్ ఎగ్గొట్టి ఆ మాటను బోగస్ చేసింది.
మక్కలు, కందులు, శనగలు, జొన్నలకు బోనస్ ఇవ్వడం లేదు. గత యాసంగి బోనస్ వెంటనే విడుదల చేయాలి.
ఈ ప్రభుత్వం కరెంటు ఇవ్వరు, రైతుబంధు వేయరు, బోనస్ ఇవ్వరు, పండిన పంటను మద్దతు ధరకు కొనరు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి మక్కలు కొనుగోలు వేగవంతం చేసి రైతులని ఆదుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాము.



రైతు వ్యతిరేక ప్రభుత్వం.వారం రోజుల నుంచి పడిగాపులు

# తెలంగాణలో కులాంతర వివాహాలు – కొన్ని సామాజికవర్గాల్లో మారుతున్న ధోరణులు

హైదరాబాద్, ఏప్రిల్ 16: తెలంగాణ రాష్ట్రంలో కులాంతర వివాహాలు ఇంకా పరిమితంగానే ఉన్నప్పటికీ కొన్ని వర్గాల్లో మాత్రం మార్పు గణనీయంగా కనిపిస్తోంది. అయ్యంగార్లు, అయ్యర్లు వర్గంలోని 12 శాతం కుటుంబాల్లో కులాంతర వివాహాలు జరిగినట్లు సమగ్ర కుటుంబ సర్వే వివరాలు చెబుతున్నా యి. ఎస్సీ క్రిస్టియన్లు(9.9శాతం), రాజులు (8.7శాతం) కూడా ఈ దిశలో ముందంజలో ఉన్నారు. బీసీ–ఎ గంగిరెద్దులవారు, అగ్నికుల క్షత్రియులు, ఓసీ కాపులు, బ్రాహ్మణుల వంటి వర్గాల్లో కూడా ఈ ధోరణి పెరుగుతున్నట్లు కనిపిస్తోంది.ముఖ్యంగా పట్టణాలు, నగరాల్లో నివసించే వర్గాల్లో కుల పరిమితులు చాలా మేరకు తగ్గుతున్నాయి. మరోవైపు ఎస్టీ కొలాం(2.6 శాతం), బీసీ–డి మాలి(2.6శా తం), ఎస్టీ గోండ్లు(2.8శాతం) వంటి వర్గాల్లో కులాంతర వివాహాలు చాలా తక్కువగా నమోదు అయ్యాయి. వీటి వెనుక భౌగోళిక వేర్పాటు, సంప్రదాయాల ప్రభావం ముఖ్య కారణాలుగా చెబుతున్నారు. ఆర్థికంగా బలమైన వర్గాలైన ఓసీ వెలమలు(5.1శాతం), రెడ్లలో(4.4శాతం) కూడా కులాంతర వివాహాలు తక్కువగా జరిగాయిఆకస్మికంగా వచ్చే ఖర్చులతో అప్పులు : ఇది ఆర్థిక అభివృద్ధి ఉన్నా కుల ఆచారాలు ఇంకా బలంగానే ఉన్నాయనే అంశాలను సూచిస్తోంది. వివాహాలు లేదా వైద్య అవసరాల కోసం తీసుకునే అప్పులు ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల చేస్తున్నాయి. ఆకస్మికంగా సంభవించే ఖర్చులు ఈ వర్గాలను అప్పుల బారిన పడేలా చేస్తున్నాయి. అలాగే అనధికార రుణదాతలపై ఆధారపడే పరిస్థితి కూడా ఈ వర్గాల్లో ఇప్పటికీ ఎక్కువగా ఉంది. బ్యాంకుల వంటి అధికారిక ఆర్థిక సంస్థల సేవలు వీరికి అందుబాటులో లేకపోవడాన్ని ఇది సూచిస్తోందని సమగ్ర సర్వేలో




తేలింది.విద్యాస్థాయుల్లో అసమానతలు : రాష్ట్ర జనాభాలో 90 శాతంగా ఉంటూ ఒక్కొక్కటి 50,000 కంటే ఎక్కువ జనాభా కలిగిన 56 ప్రధాన కులాల విద్యా స్థాయుల్లో అసమానతలున్నాయని రాష్ట్ర ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. ఓసీ(అప్పర్ క్యాస్ట్)ల్లో అందరి కంటే ఎక్కువగా జైనుల్లోనే విద్యాపరంగా అత్యంత వెనుకబాటుతనం ఉందని వెల్లడించింది. బీసీల్లోని బీసీ–ఏలో వడ్డెరలు విద్యాపరంగా అత్యంత వెనుకబడిన వర్గంగా చివరి స్థానంలో ఉండటం గమనార్హం. ఓసీలైన రెడ్లు విద్యాసాధనలో బీసీ–సీలోని దళిత క్రైస్తవులు, బీసీ–బీలోని కంసాలి వంటి కొన్ని వెనుకబడిన తరగతుల వర్గాలతో సమానంగా ఉండటం విశేషం. ఓసీ ముస్లింలు విద్యాపరంగా కొంత వెనుకంజలో ఉన్నారు. వీరు అనేక బీసీ గ్రూపుల కంటే దిగువ స్థాయిలో ఉన్నారు. బీసీ–ఏలోని వాల్మీకులు, పిచ్చిగుంట్ల, బీసీ–ఇలోని ఖురేషి ముస్లింలు, బీసీ–బీలోని ఆరె మరాఠి, బీసీ–డీలోని మాలిలు, బీసీ–ఏలోని అగ్నికులక్షత్రియ, ముదిరాజ్ కులాలు మెజారిటీ షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) కంటే విద్యాపరంగా వెనుకబడి ఉన్నారు. ఆర్యవైశ్యులు, వెలమలు, బ్రాహ్మణుల్లో 37 శాతం : తెలంగాణలో డిప్లొమా, అంతకంటే ఎక్కువ ఉన్నతవిద్య చదివిన వారి సగటు 36.3 శాతంగా ఉంది. ఉన్నత విద్యాసాధనలో అగ్రస్థానంలో ఉన్న కులానికి, అట్టడుగున ఉన్న కులానికి మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా స్పష్టంగా ఉంది. ఎస్టీ కొలాం వర్గంలో కేవలం 4.4 శాతం మంది మాత్రమే డిప్లొమా లేదా అంతకంటే ఎక్కువ చదువును కలిగి ఉన్నారు. ఓసీలైన ఆర్యవైశ్యులు(కోమటి), వెలమలు, బ్రాహ్మణుల్లో అత్యధికంగా 37 శాతం మంది ఈ స్థాయి విద్య అభ్యసించారు. ఇది రాష్ట్ర సగటు కంటే దాదాపు రెట్టింపుగా ఉంది. విద్య విషయంలో ఎస్సీ గోండ్లు, బీసీ–డీ మాలిలు, బీసీ–ఇ ఖురేషి ముస్లింలు, బీసీ–ఏ వడ్డెర, వాల్మీకులు, బీసీ–ఇ షేక్ ముస్లింలు, ఎస్సీ మాదాసీలు, ఓసీ ముస్లింలు, అత్యంత వెనుకబడి ఉన్నారు. మరోవైపు చాలా వరకు ఓసీ కులాలతో పాటు సరిసమానంగా బీసీలు, క్రిస్టియన్లు, బీసీ–బీ పద్మశాలీలు, కంసాలి, పెరిక వంటి బీసీ కులాలు ఉన్నత విద్యలో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాయి.

ఇంగ్లీష్? మీడియంలో : తెలంగాణలోని 56 ప్రధాన కులాలను పరిశీలిస్తే, ప్రతి కులం నుంచి 30 ఏళ్లలోపు ఉన్నవారిలో సగటున 47 శాతం మంది ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నారు. ఓసీల్లో బ్రాహ్మణులు, ఆర్యవైశ్యుల్లో ఇది 72 శాతం ఉండగా, ఎస్టీలైన కొలాం సామాజిక వర్గంలో కేవలం 11 శాతం మాత్రమే ఉంది. ఎస్సీ మాలల శాతం రాష్ట్ర సగటుతో సమానంగా ఉండగా, మెజారిటీ ఎస్సీ, ఎస్టీ కులాలు 47 శాతం సగటు కంటే తక్కువగానే ఉన్నాయి. ప్రతి కులం నుంచి సగటున 9.8 శాతం మంది పిల్లలు ప్రైవేటు లేదా ప్రభుత్వేతర స్కూళ్లకే వెళ్తున్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గంలో 38 శాతం కంటే ఎక్కువ మంది పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు వెళు ండగా, ఎస్సీ కొలాంలలో కేవలం 1 శాతం మందికే ఈ అవకాశం అందుబాటులో ఉంది. కార్లలో 16.40 శాతంతో బ్రాహ్మణులే : అత్యధికంగా 16.40 శాతం బ్రాహ్మణుల ఇళ్లలో సొంత కార్లు ఉన్నాయి. ఓసీల వద్ద ఓబీసీల కంటే మూడు రెట్లు, ఎస్సీలు, ఎస్టీల కంటే ఐదు రెట్లు అధికంగా కార్లు కలిగి ఉన్నారు. రాష్ట్రంలో సగటున 3.20 శాతం కుటుంబాలకు సొంత కార్లున్నాయి. అత్యధిక శాతం బ్రాహ్మణ కుటుంబాలకు ఉండగా ఆ తర్వాత రాజులు, కమ్మలు, కాపులు, వైశ్యులు, వెలమలు, జైన్ల కుటుంబాల వారే ఎక్కువగా ఉన్నారు. బీసీ–సి క్రిస్టియన్లు, బీసీ–బిలోని కంసాలి కుటుంబాల్లో కూడా సగటు, అంతకంటే ఎక్కువగా కార్లు ఉన్నాయని తెలిసింది. అతి తక్కువగా ఎస్టీ కొలాంలో 0.2 శాతం కుటుంబాల్లో మాత్రమే కార్లు ఉన్నాయి.

# బీసీలు చట్టసభల్లో ఉన్నప్పుడే వారికి న్యాయం జరుగుతుంది: శ్రీనివాస్ గౌడ్



ఢిల్లీ, ఏప్రిల్ 16: తెలంగాణలో నిర్వహించిన కుల గణన గణాంకాలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బీసీల అసలు జనాభాను ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపిస్తున్నారని ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 61 శాతం వరకు ఉన్న బీసీ జనాభాను తక్కువగా చూపిస్తూ వాస్తవాలను వక్రీకరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ను ఇప్పటివరకు అమలు చేయలేదని, కులాల వారీగా ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేదని మండిపడ్డారు.బీసీలకు తగిన రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా కేవలం పదవులు ఇస్తున్నామంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీ కుటుంబాల వివరాలు సరిగ్గా సేకరించలేదనే కారణంతోనే తెలంగాణలో కుల గణన వివరాలు బయటపెట్టారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ గణాంకాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని స్పష్టం చేశారు.బీసీలకు న్యాయం జరగాలంటే ముందుగా కామారెడ్డి డిక్లరేషన్‌ను పూర్తిగా అమలు చేయాల్సిందేనని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని, బీసీలు చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందినప్పుడే వారికి న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 56 శాతం పైగా ఉన్న బీసీ జనాభాకు తగిన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు.

# రేవంత్ ట్రాప్‌లో సౌత్ ప్రజలు పడరు

హైదరాబాద్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు (ఆరోపించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోం దన్నారు. గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుతో



దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు.రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని తెలంగాణ బీజేపీఅధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు.

# డ్యూటీలో చేరకుంటే డిస్మిస్.. ఆర్టిజన్ల సమ్మెపై ట్రాన్స్‌కో ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 16: తెలంగాణ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు (ఆర్టిజన్లు) చేపట్టిన సమ్మె తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది. గత కొన్ని రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టిజన్లు నిరసనలు తెలుపుతున్నారు. ఎక్కడికక్కడ విధులు బహిష్కరించి ఆందోళనలు చేపడుతున్నారు. విద్యుత్ ఉద్యోగులతో సమానంగా హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమ్మెకు దిగిన ఆర్టిజన్లపై విద్యుత్ యంత్రాంగం సీరియస్ యాక్షన్ తీసుకునేందుకు రెడీ అయింది. సమ్మెను వెంటనే విరమించి ఉదయం 11 గంటలలోగా విధుల్లో రిపోర్ట్ చేయాలని.. లేనిపక్షంలో వారిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించినట్లుగానే పరిగణిస్తామని ట్రాన్స్‌కో బుధవారం రాత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.విద్యుత్ సరఫరా అనేది అత్యంత కీలకమైన నిత్యావసర సేవ అని ప్రభుత్వం



గుర్తు చేసింది. టెస్మా చట్టం పరిధిలోకి వచ్చే ఏ రంగంలోనైనా సమ్మెలు చేయడం లేదా విధులకు ఆటంకం కలిగించడం చట్టరీత్యా నేరమని చెప్పింది. టెస్మా అమలులో ఉన్న సమయంలో సమ్మెకు పిలుపునివ్వడం అక్రమమని ట్రాన్స్‌కో స్పష్టం చేసింది. వినియోగదారులకు, ముఖ్యంగా వ్యవసాయం, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూడటం ప్రభుత్వ ప్రాధాన్యత అని దీనిని అడ్డుకునే ఏ చర్యలనైనా సహించే ప్రసక్తే లేదని యంత్రాంగం హెచ్చరించింది.తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ల ఐక్య కార్యాచరణ సమితి తమ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పారిశ్రామిక ట్రైబ్యునల్‌లో కేసు దాఖలు చేసింది. న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్న సమ్మెకు వెళ్లడం పారిశ్రామిక వివాదాల చట్టం, ఇతర సేవా నిబంధనలకు విరుద్ధమని ట్రాన్స్‌కో వివరించింది. కోర్టులో సమస్య ఉన్నప్పుడు చర్చల ద్వారా లేదా తీర్పు ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప ఇలా ప్రజలను ఇబ్బంది పెట్టేలా సమ్మె చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొంది. గడువు ముగిసిన తర్వాత కూడా విధుల్లో చేరని వారి స్థానంలో కొత్తవారిని నియమించుకోవడానికి లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం వెనకాడబోదని చెప్పింది. ఆర్టిజన్ల భవితవ్యం ఇప్పుడు వారు తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది.

# హైదరాబాద్ శివారులో అంతర్జాతీయ పండ్ల మార్కెట్.. త్వరలోనే టెండర్లు, మంత్రి కీలక ప్రకటన

హైదరాబాద్ :శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంతర్జాతీయ పండ్ల మార్కె ట్ ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ మార్కెట్ హబ్‌గా అవతరించడానికి రెడీ అవుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే పనులు విజయవంతంగా పూర్తి కావడంతో.. పనుల నిర్మాణానికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 200 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సుమారు రూ. 1000 కోట్ల అంచనా వ్యయంతో వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ గ్లోబల్ గ్రీన్ మార్కెట్ కేవలం పండ్లకే కాకుండా పూలు, డ్రై ఫ్రూట్స్, పాల ఉత్పత్తులు, సీఫుడ్స్ వంటి వాటిని ఎక్స్‌పోర్టు చేయనున్నాయి.ఈ మార్కెట్ ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయి. ఎగుమతులకు వీలుగా అంతర్జాతీయ



ప్రమాణాలతో కూడిన క్వాలిటీ టెస్టింగ్ లాబొరేటరీలు, సుమారు 400 రిటైల్ అవుట్‌లెట్లు, 4 భారీ వేలం హాళ్లు నిర్మించనున్నారు. పండ్లు దెబ్బతినకుండా ఉండేలా అత్యాధునిక కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లు ఉంటాయని మంత్రి తుమ్మల వెల్లడించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉండటం వల్ల రవాణా సౌకర్యం ఈ మార్కెట్‌కు అతిపెద్ద బలమని చెప్పారు. కొత్తపేట మార్కెట్ తరలింపు తర్వాత ప్రస్తుతం బాటసింగారంలో కొనసాగుతున్న తాత్కాలిక వ్యాపార కార్యకలాపాలన్నీ.. కోహెడ పనులు పూర్తికాగానే ఇక్కడికి షిఫ్ట్ కానున్నట్లు చెప్పారు. దీనివల్ల దళారీల ప్రమేయం తగ్గి రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా..దీనివల్ల దళారీదీనివల్ల దళారీల ప్రమేయం తగ్గి ల ప్రమేయం తగ్గి రోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.క నుగోలు కేంద్రాల్లో వసతులుఇక తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. టార్పాలిన్‌లు, తేమ శాతం కొలిచే పరికరాలు, క్లీనింగ్ డ్రైయర్ల వంటి సామగ్రిని సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఉత్పత్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో జీరో బిజినెస్ చేసేవారి లైసెన్స్‌లను రద్దు చేయాలన్నారు. ఇలా వ్యాపారం చేయటానికి ఎవరైనా అధికారులు సహకరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో మొక్కజొన్నలను విక్రయించే రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తామని స్పష్టం చేశారు. యార్డుల్లో రైతుల సౌకర్యార్థం చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఇతర శాఖల నుంచి ఇంజినీరింగ్ అధికారులను డిప్యుటేషన్‌పై తీసుకోవాని మంత్రి తమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

# ఆస్తి కోసం కన్న కొడుకులను చంపాలని తండ్రి పన్నాగం

జనగామ, ఏప్రిల్ 16: ఆస్తి కోసం కన్న బిడ్డలనే చంపాలనుకున్నాడు ఓ కసాయి తండ్రి. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం పొట్టిగుబ్బడితండా గ్రామంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కన్న కొడుకులను బిస్కెట్‌లో విషం కలిపి చంపాలని తండ్రి సుపారీ ఇవ్వడం కలకలం రేపింది. 2016 సంవత్సరంలో బానోతు శ్రీనివాస్, అనితలు వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు. కుటుంబ కలహాల నేపథ్యంలో శ్రీనివాస్ వేరే గ్రామానికి చెందిన మూడవత్ మమతను రెండో వివాహం చేసుకున్నాడు. 20 గుంటల భూమి కుమారుల పేరు మీద ఉండటాన్ని తండ్రి జీర్ణించుకోలేకపోయాడు.ఆస్తి సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో శ్రీనివాస్ తన రెండవ భార్య మమతతో కలిసి పన్నాగం పన్నాడు. కుమారులకు బిస్కెట్‌లో విషం కలిపి ఇచ్చి చంపాలని నిర్ణయించి.. అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తికి సుపారీ ఇచ్చాడు.




సుపారీ తీసుకున్న వ్యక్తి భయపడి గ్రామస్తులకు ఈ విషయాన్ని తెలిపాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రీనివాస్, రెండో భార్యను పోలీసులు అదుపులోకి తీసుకుని జనగామ కోర్టులో హాజరుపరిచారు. వీరికి న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించింది. ఆస్తి కోసం కన్న తండ్రే కొడుకులను చంపాలని యత్నించడం స్థానికంగా సంచలనం సృష్టించింది.

# ఒక మంత్రికి 10 పర్సెంట్ అనే పేరుంది.


హైదరాబాద్ :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేం అలసిపోయాం. మీరు పెట్టే అవమానం.. ఈ వ్యవస్థలో మాకు జరిగే అన్యాయాన్ని, అవమానాన్ని చక్కదిద్దే స్థితిలో మీరు లేరు. కారణమేంటో మీరే చెప్పాలి. దీని క్కారణమేంటి.. నీ వెనుక గుంతలు తవ్వుతున్నరు.. నల్లికుట్లోళ్లు ఎవరు ..? చెప్పమంటవా..? నీ గవర్నమెంట్ కూలిపోవడానికి చాలా సిద్ధంగా ఉంది. నువ్వు ఒక్కడివే పనిచేస్తే కుదరదు కదా.. వర్గీకరణ అయిన తర్వాత కూడా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సమావేశాలు పెడితే నువ్వేమైనా చేయగలిగావా...? అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అసలు అవినీతి పరులను




ఒక్కన్నన్నా నువ్వు తీసేసినవా..? ఒక్కడి మీదనన్నా నువ్వు యాక్షన్ తీసుకున్నవా.. అసలు ఎవరు అవినీతి పరులు.. ఈ గుంతలు తవ్వేటోడు ఎవరు..? అవినీతిలో 10 శాతం అని పేరు పడ్డ మంత్రి ఎవరు..? అసలు నీ పార్టీ ఎట్లొస్తది. ఇంత బహిరంగ అవినీతి రాష్ట్రంలో ఏ మూలకెళ్లి ఎవరిని అడిగినా..

# బోడుప్పల్‌లో ఘోరం.. నాలుగేళ్ల చిన్నారికి యాసిడ్ తాగించిన పిన్ని!

మేడ్చల్: జిల్లాలోని బోడుప్పల్‌లో గుండెలు పసివాడి ప్రాణాల మీదకు తెచ్చింది ఓ మహిళ. తన కొడుకును ఇంట్లో సరిగ్గా చూడటం లేదనే అక్కసుతో, తోడికోడలి నాలుగేళ్ల కుమారుడికి కిరాతకంగా యాసిడ్ తాగించింది. ఈ దారుణ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేవలం కుటుంబంలో వివక్ష చూపుతున్నారనే చిన్న కారణంతో పసివాడిపై ఇంతటి అమానుషానికి ఒడిగట్టడం స్థానికంగా కలకలం రేపుతోంది.పోలీసుల కథనం ప్రకారం.. బోడుప్పల్ శ్రీనివాస కాలనీలో నివసించే పర్వతం సతీష్ కుమార్, అంజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వారంతా ఒకే ఇంట్లో కలిసి ఉంటున్నారు. అయితే, తన పెద్ద కొడుకు కుమారుడిపై (4) మామగారు ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారని, తన బిడ్డను పట్టించుకోవడం లేదని చిన్న కోడలు మంజుల మనసులో కక్ష



పెంచుకుంది. ముఖ్యంగా మామగారు తన చేతిపై పెద్ద మనవడి పేరును పచ్చబొట్టుగా వేయించుకోవడంతో ఆమె ఓర్వలేకపోయింది. ఎలాగైనా ఆ పిల్లాడిని అడ్డుతొలగించుకోవాలని పథకం వేసింది.గతంలో కూడా ఆ పిల్లాడిని ఊపిరి ఆడకుండా చేయడం, మేడపై నుంచి కింద పడేయాలని చూడటం వంటి ప్రయత్నాలు చేసింది. అయితే కుటుంబ సభ్యులు గమనించడంతో అప్పట్లో ప్రమాదం తప్పింది. కానీ, ఈ నెల 9న ఎవరూ లేని సమయంలో పిల్లాడిని కిచెన్‌లోకి తీసుకెళ్లి, 'జ్యూస్ తాగితే చాక్లెట్ ఇస్తాను' అని నమ్మించి యాసిడ్ తాగించింది. పిల్లాడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జువ్వలదిన్నె హార్బర్ పనులపై విచారణకు సిద్ధమా?



**నెల్లూరు, ఏప్రిల్ 16:** సాగర్ డిఫెన్స్ అకాడ మీపై వైసీపీ అపోహలు సృష్టిస్తోందని ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడు తూ.. జగన్ చూపించిన కాల్ డేటాలో ఏమి లేదని.. సంక్రాంతి, జనవరికి కాల్స్ మాట్లాడితే తప్పా అని ప్రశ్నించారు. ఇస్కపల్లి పల్లిపాలెంలో వైసీపీ బెట్టింగ్‌లకు పాల్పడుతుంటే.. పోలీసుల విజ్ఞప్తి మేరకు పెద్ద కాపు తోటయ్యతో బీఎంఆర్ మాట్లాడినట్లు తెలిపారు. గ్రామాల్లో బెట్టింగ్ వల్ల గొడవలు జరగకూడదని మాట్లాడితే తప్పా అని నిలదీశారు.మాజీ మంత్రి వైఎస్ వివేకా నంద రెడ్డిని చంపిన తర్వాత జగన్ భార్యకు తొలి కాల్ వచ్చిందని.. అలాంటి కాల్స్ తాము మాట్లాడలేదని స్పష్టం చేశారు. తల్లి, చెల్లి శీలాన్ని సొంత సోషల్ మీడియాలో దుష్ప్ర చారం చేయించిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. జగన్ సంస్కారం గురించి మాట్లాడి తమ స్థాయిని దిగజార్చుకోలేమని అన్నారు. ఫిషింగ్ హార్బర్ కాంట్రాక్టర్ వైసీపీ ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డే అని ఆరోపిస్తూ, హార్బర్ పనులపై విజిలెన్స్ ఎంక్వైరీకి జగన్ సిద్ధమా అని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సవాల్ విసిరారు.జగన్ పర్యటనలు.. గొడవలు సృష్టిం చేందుకే: కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి(బుధవారం) జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబుకు వార్నింగ్ ఇచ్చే స్థాయి జగన్‌కు ఉందా అని ప్రశ్నించారు. ఇలాంటి భాష మాట్లాడటం వల్లే వైసీపీ 11 సీట్లకు పరిమితమైందని అన్నారు. గొడవలు సృష్టించేందుకే జగన్ పర్యటనలు చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గాల నుంచి బస్సులు పెట్టి సామాన్య జనాలను తరలించి మత్స్యకారులు వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీలు, మంత్రులను ఉద్దేశించి 'వాడు, వీడు' అని సంబోధిస్తే తిరిగి తాము మాట్లాడలేమా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రశ్నించారు.


## ఆ విషయాల్లో మహిళల పాత్రకు ప్రత్యామ్నాయం లేదు



**అమరావతి, ఏప్రిల్ 16:** భారతదేశం ఈరోజు నారీ శక్తిని గౌరవిస్తూ దేశంలోని మహిళలు వివిధ రంగాల్లో సాధిస్తున్న అసాధారణ విజయాలను వేడుక చేసుకుంటోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్( అన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పవన్ ఎక్స్ వేదికగా స్పందించారు. చెస్ బోర్డు నుంచి ఒలింపిక్ పోడియం వరకు భారతీయ మహిళలు దేశానికి స్ఫూర్తిని అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల సైప్రస్‌లో జరిగిన మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఆర్.వైశాలి చరిత్ర సృష్టించారని అన్నారు. ఈ టోర్నమెంట్ గెలుచుకుని, మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడే అర్హత సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచారన్నారు. ఈ విజయం భారత మహిళల ప్రపంచ స్థాయి ప్రతిభను మరోసారి నిరూపించిందన్నారు.వారే పునాదులను తీర్చిదిద్దారు..గౌరవనీయ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ బలోపేతం చేసిన పరిపాలన, ప్రజా సేవ నుంచి నారీ శక్తి ప్రయాణం.. భారత అంతరిక్ష యాత్రల్లో రితు కరిధాల్ ప్రదర్శించిన శాస్త్రీయ నైపుణ్యం వరకు విస్తరించిందన్నారు. అలాగే ప్రపంచ బాక్సింగ్ వేదికపై ఆధిపత్యం చెలాయించి దేశ గౌరవాన్ని నిలబెట్టిన నిఖత్ జరీన్ క్రీడా నైపుణ్యం కూడా.. ఈ సాధికారత ప్రయాణం భారతదేశ రాజ్యాంగ పునాదులలో లోతుగా పాతుకుపోయిందని చెప్పారు. దక్షాయణి వేలాయుధం, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మి పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి రాజ్యాంగ వ్యవస్థాపక మాతృమూర్తులు ఈ పునాదులను తీర్చిదిద్దారన్నారు. వారి కృషి తరతరాల భారతీయ మహిళలకు న్యాయం, సమానత్వాన్ని అందించిందని పవన్ పేర్కొన్నారు.ఇది చరిత్రాత్మక అడుగు...ప్రతిభకు అవకాశం లభిస్తే మహిళలు నాయకత్వం వహిస్తారని, రాణిస్తారని, దేశాలకు స్ఫూర్తినిస్తారని చరిత్ర చెబుతోందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ స్ఫూర్తితోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'నారీ శక్తి వందన అధినియమ్' సవరణ బిల్లు 2026ను ప్రవేశపెట్టారని తెలిపారు. శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా పరిపాలనలో వారికి న్యాయమైన స్థానం కల్పించే దిశగా ఇది చరిత్రాత్మక అడుగుగా నిలుస్తుందన్నారు. జనసేన పార్టీ మహిళా సాధికారత కోసం కేవలం మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ దృఢంగా నిలబడిందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే నిబద్ధత, సమాన అవకాశాలు, న్యాయమైన ప్రాతినిధ్యం పట్ల జనసేనకు ఉన్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తుందని తెలిపారు.కొత్త హక్కులను ప్రసాదించడం కాదు..మహిళలే సమాజానికి పునాది అని... కుటుంబాలను పోషించడం నుంచి దేశాన్ని తీర్చిదిద్దడం వరకు వారి పాత్రకు ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ఒక మహిళ ఉన్నత స్థాయికి ఎదిగితే దేశం కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇది కొత్త హక్కులు ప్రసాదించడం కాదని.. మహిళలకు న్యాయబద్ధంగా చెందాల్సిన వాటిని పునరుద్ధరించడమే అని స్పష్టం చేశారు. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను, బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయన్నారు. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదంగా మిగిలిపోదని.. అది మన నాగరికతకు బలమైన శక్తిగా నిలుస్తుందన్నారు. న్యాయబద్ధమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించే దిశగా 'శక్తి' స్ఫూర్తితో ముందుకు సాగాలి అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## చంద్రబాబు గత టర్మ్‌లో సీఎస్.. త్వరలోనే రాష్ట్ర ఎన్నికల కమిషనర్..! ఎవరీ అనిల్ చంద్ర పునేఠా..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ)గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేఠా నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ పోస్ట్‌కు పునేఠా పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. పునేఠా నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే గవర్నర్ ద్వారా నియామక ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు సమాచారం. పునేఠా 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. అయితే 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుతో కేంద్ర ఎన్నికల సంఘం ఆయన్ను సీఎస్ పోస్టు నుంచి తప్పించగా.. ఆ తర్వాత ఆయన రిటైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను విజిలెన్స్ కమిషనర్‌గా నియమించారు. తాజాగా ఎన్నికల కమిషనర్‌గా పునేఠా సేవల్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ) నీలం సాహ్ని పదవీకాలం మార్చి నెలాఖరుతో ముగిసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో పునేఠాకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. పునేఠా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ)గా బాధ్యతలు అప్పగిస్తే.. విజిలెన్స్ కమిషనర్‌గా మరో రిటైర్డ్ ఐఏఎస్, మాజీ సీఎస్ నీరభ్ కుమార్‌ను నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.అనిల్ చంద్ర పునేఠా సొంత రాష్ట్ర ఉత్తరాఖండ్. ఎకనమిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ఆయన.. రూరల్ డెవలప్‌మెంట్‌లో పీజీ చదివారు. ఎల్‌ఎల్‌బీ కూడా పూర్తి చేశారు. 1984 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన పునేఠా.. కడప జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం ద్వారా ఐఏఎస్ అధికారిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఆయన వరుసగా మూడుసార్లు ఉత్తమ కలెక్టర్‌గా అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, భూపరిపాలన ప్రధాన కమిషనర్ ()గా, ఉద్యాన, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగానూ ఆయన పనిచేశారు. 2018 సెప్టెంబర్‌లో నాటి టీడీపీ ప్రభుత్వం అనిల్ చంద్ర పునేఠాకు సీఎస్‌గా బాధ్యతల్ని అప్పగించింది. అయితే 2019 ఎన్నికల సమయంలో ఇంటెలిజెన్సీ డీజీ బదిలీ విషయంలో ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం చేశారనే కారణంతో.. చీఫ్ సెక్రటరీ పదవి నుంచి ఆయన్ను తప్పించింది. ఎల్వీ సుబ్రహ్మణ్యంను నూతన సీఎస్‌గా నియమించింది. ఆ తర్వాత పునేఠా ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గానూ ఆయన పని చేశారు.

## జనంలో ఉండాలి.. జనం కోసం పనిచేయాలి

**నెల్లూరు, ఏప్రిల్ 16:**

రూరల్ నియోజకవర్గంలో రూ.650కోట్లతో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. (గురువారం) ఉదయం మనుమసిద్ధి నగర్‌లో రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని జరుగుతున్నాయని వివరించారు. సీఎం చంద్రబాబు, జిల్లా మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో ఇంతగా అభివృద్ధి పనులు చేయగలుగుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు.టీడీపీలో అతిసామాన్యులకు ఉన్నత పార్టీ పదవులు ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఇష్టంగా కష్టం చేస్తే కచ్చితంగా ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండానే నేరుగా చంద్రబాబు, లోకేశ్ పదవులు ఇస్తారని వెల్లడించారు. నేతలు



ఎప్పుడూ జనంలో ఉండాలని.. జనం కోసం పనిచేయాలని సూచించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లకు రాష్ట్ర కమిటీల్లో స్థానం కల్పించారన్నారు. 'నిరంతరం జనంలో ఉండాలి.. చమట కారేలా కష్టం చేయాలి. ఎమ్మెల్యే తమ్ముడినని సోగ్గా చొక్కాలు వేసుకుని తిరిగితే పదవులు రావు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.మాకందరికీ కోటంరెడ్డి ఆదర్శం: దామచర్ల సత్యఈ కార్యక్రమంలో మారిటోరియం ఛైర్మన్ దామచర్ల సత్య, టీడీపీ నేత గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం - 8 మంది మృతి

**కర్నూలు:** కర్నూలు జిల్లాలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రా ల యం మండలం చిలకలడోన వద్ద జాతీయ రహదారిపై బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీ కొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా మరో 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతి చెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు.మృతుల వివరాలు: మృతులు కర్ణాటకలోని చిక్‌మంగళూరు కనయాకనహల్లి వాసులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు.దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం: కర్ణాటకలోని చిక్‌మంగ ళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని



శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరు కుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బొలేరోలో 23 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు.చిలకలడోన గ్రామం దగ్గర జాతీయ రహదారి 167 పైన రోడ్డు ప్రమాదం జరిగింది. బీదర్? నుంచి టుముకూరు వెళ్తున్న రెడీమిక్స్ లారీని ఎదురుగా వస్తున్న, మంత్రాలయం వెళ్తున్న అశోక్? లేలాండ్? ఢీ కొట్టింది. ప్రమాదంలో ఐదుగురు మహిళలు, మూడు సంవత్సరాల వయసున్న బాలిక, ఇద్దరు మగవాళ్లు మృతి చెందారు. గాయపడ్డ వారిలో ఏడుగుర్ని కర్నూలుకు తరలించగా, మరో నలుగురు ఎమ్మి గనూరులో చికిత్స పొందుతున్నారు.

## దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు - స్పష్టం చేసిన కేంద్రమంత్రులు

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని, జనాభా సంఖ్యతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం చొప్పున సీట్లు పెరుగుతాయని కేంద్ర మంత్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లకు స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు ఉంటుందని తేల్చి చెప్పటంతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని వివరించారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లుకి ఆమోదం ఘట్టాన్ని అమరావతి నుంచి వీక్షించే ఏర్పాటు చేయటంతో పాటు వైఎస్సార్సీపీ సహా అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించా లని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్, పల్లా శ్రీనివాసరావులు నిర్ణయించారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో కూటమి పార్టీల నేతల సమావేశం జరిగింది. చంద్రబాబుతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పల్లా శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఆ రెండు అంశాలకు సంబంధించిన ముసాయిదా బిల్లుల్లో పొందుపరిచిన



అంశాలపై చర్చించారు. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచుతామని మాత్రమే ఆ బిల్లులో ఉందని, దాని వల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కొన్ని రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్న సందేహాలపై ప్రధానంగా చర్చ జరిగింది.3 పార్టీల నేతలు సంతృప్తి : ఆ సందేహాల్ని నివృత్తి చేసుకునేందుకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌తో పాటు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో ఇప్పుడున్న లోక్‌సభ స్థానాలు 50 శాతం పెరుగుతాయని, అదే విషయాన్ని పునర్విభజన బిల్లులో కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంటుందని వారు స్పష్టతనిచ్చారు. దాంతో సంతృప్తి చెందిన కూటమి పార్టీల నేతలు ఆ బిల్లుని కలసికట్టుగా స్వాగతించాలని నిర్ణయించారు. కొందరు కావాలనే ఆ బిల్లుపై దుష్ప్రచారం చేస్తున్నారన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంచినప్పుడు ఒక లోక్‌సభ స్థానం పరిధిలోని సగటు జనాభాకి సంబంధించి రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య చాలా వ్యత్యాసానికి అవకాశం ఉందన్న చర్చ జరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్కో లోక్‌సభ స్థానం పరిధిలో సగటు జనాభా చాలా తక్కువంటే, కేరళ వంటి అధిక జనాభా కలిగిన రాష్ట్రాల్లో 20 లక్షల వరకు ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సగటు జనాభా మధ్యస్థంగా ఉంటుందన్న చర్చ జరిగింది. అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా 50 శాతం పెంచే అంశాన్ని పునర్విభజన ముసాయిదా బిల్లులో ప్రస్తావించకపోవడంపై కేంద్ర మంత్రులతో కూటమి నేతలు చర్చించారు. ఆ అంశం ముసాయిదాలో ప్రస్తావించకపోయినా, పార్లమెంటులో చర్చ సందర్భంగా దానిపై స్పష్టతనిస్తామని, కానిపక్షంలో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెంచే అధికారాన్ని పునర్విభజన కమిటీకే ఇస్తామని కేంద్ర మంత్రులు స్పష్టం చేసినట్టు తెలిసింది.

## పిఠాపురం వర్మకు పదవి.. ఎట్టకేలకు కరుణించిన టీడీపీ అధిష్టానం

**పిఠాపురం :**మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు టీడీపీ అధిష్ఠానం ఎట్టకేలకు ఓ పదవి ఇచ్చింది. ఆయనకు పార్టీ ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టింది. దీంతో గత ఎన్నికల సమయంలో ఆయన చేసిన త్యాగానికి కొంత వరకైనా గుర్తింపు లభించినట్ల య్యింది. వాస్తవానికి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వర్మకు చంద్రబాబు నాయుడు ఎమ్మెల్సీ పదవిని ఆఫర్ చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వర్మకు పదవిని ఎప్పుడు ఇస్తారా అని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దాదాపు రెండేళ్లు గడిచినప్పటికీ ఆయనకు ఎమ్మెల్సీ పదవిని చంద్రబాబు ఇవ్వలేకపోయారు. దీంతో ఇప్పుడు పార్టీ ఉపాధ్యక్ష పదవిని అప్పగించారు. వర్మకు పిఠాపురంలో సొంతంగా బలం ఉంది. 2014 ఎన్నికల్లో టీడీపీ అధిష్ఠానం ఆయనకు ఎమ్మెల్యే సీటు ఇవ్వలేదు. దీంతో ఇండిపెండె ంట్‌గా పోటీ చేసి ఆయన గెలుపొందారు. అనంతరం తెలుగుదేశంలో చేరారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ.. జగన్ వేవ్





కారణంగా పెండెం దొరబాబు చేతిలో ఓటమిపాలయ్యారు. 2024లో తనకే టికెట్ దక్కుతుందని వర్మ భావించారు. అయితే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో.. వర్మ తన సీటును జనసేనాని కోసం త్యాగం చేయాల్సి వచ్చింది. అంతేకాదు పిఠాపురంలో పవన్ కళ్యాణ్ విజయం కోసం వర్మ పని చేశారు.అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పిఠాపురంలో టీడీపీ, జనసేన మధ్య బేధాభిప్రాయాలు మొదలయ్యాయి. పలు సందర్భాల్లో ఈ విషయం బయటపడింది. అలాగే ఎమ్మెల్సీగా వర్మకు అవకాశం దక్కలేదు. వర్మను ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేయడం ద్వారా.. పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తామని, వారి సేవలను గుర్తిస్తామని టీడీపీ అధినాయకత్వం సంకేతాలు పంపింది.కమిటీలు ఏర్పాటు చేసిన టీడీపీ.వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ.. సంస్థాగతంగా కీలక నిర్ణయం తీసుకుంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్రస్థాయి కమిటీలను నియమించింది. ఈ కమిటీలలో పలువురు నేతలకు స్థానం కల్పించింది. పార్టీ పట్ల విధేయత, కష్టపడే తత్వం, రాజకీయ అనుభవాన్ని లెక్కలోకి తీసుకుని పదవులు ఇచ్చింది. ఈ క్రమంలోనే మంత్రి నారా లోకేష్‌కు ప్రమోషన్ ఇచ్చిన టీడీపీ అధిష్టానం.. జాతీయ ప్రధాన కార్యదర్శి నుంచి టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. అలాగే టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావుకు మరో అవకాశం ఇచ్చారు. 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ ఏర్పాటు చేసింది. జాతీయ ప్రధాన కార్యదర్శుల ుగా ముగ్గురిని, 18 మందిని జాతీయ ఉపాధ్యక్షులుగా, 10 మందిని జాతీయ అధికార ప్రతినిధులుగా నియమించారు.ఇక రాష్ట్ర కమిటీలో 185 మందికి స్థానం కల్పించారు. ఇందులో ఏడుగురు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, 16 మంది రాష్ట్ర ఉపాధ్యక్షులు, 14 మంది అధికార ప్రతినిధులు, 10 మంది రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు, 59 మంది రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు, 77 మంది రాష్ట్ర కార్యదర్శులు ఉన్నారు. ఈ క్రమంలోనే పిఠాపురం నియోజకవర్గం టీడీపీ ఇంఛార్జి ఎస్వీఎస్ఎన్ వర్మను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. పంచమర్తి అనురాధ, కిమిడి కళా వెంకటరావు, బొండా ఉమామహేశ్వరరావు వంటి నేతలను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించారు.

## టీడీపీలో ఎన్నో సంస్కరణలకు లోకేశ్ శ్రీకారం

**అమరావతి, ఏప్రిల్ 16:** పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ధైర్యంగా ముందడుగు వేసిన నాయకుడు లోకేశ్ అని మంత్రి గొట్టిపాటి రవికుమార్(అన్నారు. గురువాం ం మీడియాతో మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రాష్ట్రం బాగు కోసం ఎక్కడా వెనుకడుగు వేయలేదని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒంగోలు మహానాడు నిర్వహణ సహా పార్టీ కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా చూడటం లోకేశ్ కోఆర్డినేషన్ వల్లే సాధ్యమైందని



చెప్పుకొచ్చారు.ఓ ప్రాంతీయ పార్టీని గొప్పగా నడుపుతూ లోకేశ్ అన్ని విధాలా టీడీపీని ముందుకు నడిపిస్తున్నారని మంత్రి కొనియాడారు. కార్యకర్తల సంక్షేమ నిధితో పాటు ఎన్నో కీలక సంస్కరణలకు యువనేత శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇన్సూరెన్స్ పాలసీ కార్యకర్తలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కోటి మంది సభ్యులతో పార్టీని బలోపేతం చేయటం లోకేశ్ క్రెడిట్ అని మంత్రి అన్నారు. కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇస్తూ అహర్నిశలు ప్రజల బాగు కోసం పరితపిస్తున్నారని చెప్పారు. మంత్రిగానూ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పెట్టుబడుల స్థాపనకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యా విధానంలో లోకేశ్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# ఆ బిల్లులు దురుద్దేశపూరితమైనవి- కొన్ని రాష్ట్రాలకు అపారమైన నష్టం : కాంగ్రెస్



**న్యూ ఢిల్లీ :**మహిళా రిజర్వేషన్లను అమల్లోకి తేవడానికి వీలుగా కేంద్రం తీసుకొస్తున్న మూడు బిల్లులపై కాంగ్రెస్ స్పందించింది. ఈ బిల్లులను మహిళా రిజర్వేషన్ల కోసం తీసుకున్న చర్యలుగా కేంద్రం చెబుతున్నప్పటికీ, వాటి అసలు ఉద్దేశం డీలిమిటేషన్‌పైనే ఉందని ఆరోపించింది. ఈ బిల్లులు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య సమతుల్యతను గణనీయంగా మార్చగలవని విమర్శించింది. డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షానికి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుత లోక్‌సభ సభ్యులలో మూడింట ఒక వంతు స్థానాలను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన మహిళలకు రిజర్వ్ చేయాలని డిమాండ్ చేసింది. ఇది రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండే ప్రజాస్వామ్య యుతమైన విధానమని అభిప్రాయపడింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాలకు అనుకూలంగా డీలిమిటేషన్ : జైరాం రమేశ్ "లోక్‌సభలో మూడు బిల్లులు పరిశీలనకు రానున్నాయి. వాటిని మహిళా రిజర్వేషన్లనే కోసమే తీసుకొచ్చామని చెబుతున్నారు. కానీ వాటి అసలు ఉద్దేశం మాత్రం నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించినదే. ప్రస్తుతం బీజేపీ బలంగా ఉన్న కొన్ని అధిక జనాభా గల రాష్ట్రా కు అనుకూలంగా ఉన్న ఈ పునర్విభజన ప్రతిపాదనలపై దేశవ్యాప్తంగా అనేక ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ బిల్లుతో లోక్‌సభలో పలు రాష్ట్రాల బలం తగ్గుతుంది. అసోం, జమ్ముకశ్మీర్‌లలో నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తీరు, మోదీ-షా ద్వయం ఎంత ఘోరంగా పనిచేస్తుందో మనకు తెలియజేస్తుంది. ఈ బిల్లుల అసలు ఉద్దేశం దురుద్దేశపూరితమైనది. వాటిలోని అంశాలు మోసపూరితమైనవి. ఈ బిల్లుకు కలిగించే నష్టం అపారమైనది. వాటిని పూర్తిగా తిరస్కరించాలి. లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలలో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్‌లోకి వచ్చినప్పుడు 2023లో ప్రతిపక్షం ఇదే వైఖరిని తీసుకుంది. ఇప్పుడు అంతే." అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.ఈ బిల్లు దేశ రాజకీయ వ్యవస్థకు హానికరం, వినాశకరం : మనీశ్ తివారీడీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తప్పుపట్టారు. ఈ బిల్లు దేశ రాజకీయ వ్యవస్థకు హానికరం, నష్టదాయకం, వినాశకరమని పేర్కొన్నారు. "నేను మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు మద్దతు ఇస్తున్నాను. ప్రమాదకరమైన ఈ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాను. ఎందుకంటే దీని పర్యవసానాలు మన రాజకీయ వ్యవస్థకు హానిచేస్తాయి. అలాగే నష్టపరుస్తాయి. ప్రభుత్వ ప్రణాళిక లోక్‌సభలో ప్రాతినిధ్య సమతుల్యతను మార్చేస్తుంది. " అని మనీశ్ తివారీ స్పష్టం చేశారు.బిల్లును వీగిపోయేలా చేస్తాం : టీఎంసీ ఎంపీ సాగరికవిపక్ష పార్టీలన్నీ మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తుండగా, మోదీ ప్రభుత్వం మాత్రం డీలిమిటేషన్ సవరణ బిల్లును తీసుకువస్తోందని టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ మండిపడ్డారు. ఈ బిల్లు ప్రతిపక్షపాలిత రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సీట్లను పెంచుతుందని ఆరోపించారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు 2026కు వ్యతిరేకంగా ఓటేసి, ఈ బిల్లును వీగిపోయేలా చేస్తామన్నారు. కనిమొళి కీలక నిర్ణయంమరోవైపు, మహిళా రిజర్వేషన్ తక్షణ అమలు, నియోజకవర్గాల పునర్విభజన, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసెంబ్లీ సీట్ల పెంపునకు సంబంధించిన మూడు బిల్లులను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో డీఎంకే ఎంపీ కనిమొళి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.బిల్లు ప్రతిని కాల్చేసిన స్టాలిన్‌తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ మూడు బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు కాపీని గురువారం ఉదయం కాల్చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్త డీలిమిటేషన్ వ్యతిరేక ఆందోళనను ప్రారంభించేందుకు నల్ల జెండాను కూడా ఎగురవేశారు. "ఈ ప్రతిఘటన జ్వాలలు తమిళనాడు అంతా వ్యాపించి, బీజేపీ అహంకారాన్ని అణచివేయాలి. గతంలో తమిళనాడులో హిందీకి వ్యతిరేకంగా చేపట్టిన ప్రతిఘటన జ్వాల ఢిల్లీని దహించేసింది. ఢిల్లీ దిగొచ్చిన తర్వాతే మా జ్వాల చల్లారింది. ఈ రోజు తమిళులను వారి సొంత గడ్డపై శరణార్థులుగా మార్చే నల్ల చట్టం ప్రతిని తగలబెట్టి నేను మరో జ్వాలను రగిలించాను. ఈ జ్వాల కూడా ద్రవిడ భూమి అంతటా వ్యాపిస్తుంది. ఇది బీజేపీ అహంకారాన్ని అణచివేస్తుంది" అని స్టాలిన్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## విజయ్ రోడ్‌షోకు పోటెత్తిన జనం




**చెన్నై:** అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో పోటీచేస్తున్న టీవీకే అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ బుధవారం పాల్గొన్న రోడ్‌షోకు ప్రజలు పోటెత్తారు. ఈ నెల 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసేందుకు నిర్ణయించిన విజయ్ 'విజిల్' గుర్తుపై పోటీచేయనున్న అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు విజయ్ పలు జిల్లాల్లో రోడ్‌షో, సభల్లో పాల్గొని విజిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.మంగళవారం తిరు ప్పూర్ జిల్లాలోని తిరుప్పూర్ నార్త్, తిరుప్పూర్ సౌత్, అవినాశి, పల్లడం, గాంగేయం, ధారా పురం, ఉడుమలై, మడత్తుకుళం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. బుధవారం గ్రేటర్ చెన్నైలోని టి.నగర్, ఎగ్మూర్, ట్రిప్లికేన్ నియోజకవర్గాల్లో రోడ్‌షోలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తూ టీవీకే గుర్తు విజిల్‌ను చూపించి ఓటు వేయాలని సైగ చేశారు. సాయంత్రం 4 గంటలకు టి.నగర్‌లోని సీఐటీ నగర్ నుండి ప్రారంభమైన విజయ్ రోడ్‌షో టి.నగర్ బస్ స్టాండ్, సౌత్ ఉస్మాన్‌రోడ్డు, హబీబుల్లా రోడ్డు జంక్షన్ల మీదుగా నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టమ్‌కు చేరుకుంది.అక్కడ ప్రజలకు అభివాదం చేస్తూ విజయ్ చేట్‌పేట్ వంతెన మీదుగా పయనించి ఎగ్మూర్ నియోజకవర్గానికి చేరుకున్నారు. రోడ్‌షోలో పాల్గొన్న విజయ్‌ను నేరుగా చూసేందుకు ఈలలు వేస్తూ, కేరింతలు కొడుతూ యువత ఉత్సాహంగా పరుగులు తీశారు. గతంలో విజయ్ పాల్గొన్న సభల్లో చోటుచేసుకున్న తొక్కిసలాట మళ్లీ పునరావృతం కాకుండా నగర పోలీసులు, ట్రాఫిక్ విభాగం పోలీసులు రోడ్‌షో సాగిన మార్గాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన బీజేపీ చీఫ్ నితిన్ నబీన్




**న్యూఢిల్లీ, ఏప్రిల్16:** రాజ్యసభ సభ్యుడిగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి బీజేపీకి చెందిన పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. అలాగే వేం నరేందర్ రెడ్డి, అభిషేక మను సింఘ్వీలు కూడా ఈ రోజే రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వేం నరేంద్ర రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.బిహార్ నుంచి రాజ్యసభకు..బిహార్‌కు చెందిన నితిన్ నబీన్ ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో బిహార్‌లోని తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. బిహార్ నుంచి నితిన్ నబీన్, శివేష్ రామ్, నితీశ్ కుమార్‌తోపాటు పలువురిని రాజ్యసభ అభ్యర్థులుగా బీజేపీ ప్రకటించింది. రాజ్యసభకు వీరు ఎంపిక కావడంతో.. సభ్యుడిగా బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు.తెలంగాణ నుంచి రెండు.తెలంగాణ నుంచి రెండు రాజ్యసభ సీట్లు ఖాళీ అయ్యాయి. అవి అధికార కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడ్డాయి. పార్టీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని వరుసగా రెండోసారి కాంగ్రెస్ పార్టీ రాజ్యసభకు పంపింది. సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా ముద్రపడిన వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు ఎంపిక చేశారు. దీంతో వీరిద్దరి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ రోజు వారి ప్రమాణ స్వీకారం జరిగింది. తెలంగాణలో ఈ రెండు రాజ్యసభ స్థానాల్లో తీవ్ర పోటీ నెలకొంది. పలువురు సీనియర్లు సైతం తమకు రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పించాలంటూ పార్టీ అధిష్ఠానానికి వరుస బెట్టి లేఖలు రాశారు. చివరకు ఆ ఎంపీ పదవి కాస్తా వేం నరేందర్ రెడ్డిని వరించింది.

## 500/500 మార్కులు- (సీబీఎస్ఈ)రిజల్ట్స్‌లో టీనా, ముదిత్ అదుర్స్- సంబరాలే సంబరాలు!




**న్యూ ఢిల్లీ :**సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) బుధవారం (ఏప్రిల్ 15) 10వ తరగతి ఫలితాలను విడుదల చేయగా, ఒడిశాలోని పూరీకి చెందిన టీనా రథ్, పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చెందిన ముదిత్ జైన్ 500కి 500 మార్కులు సాధించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమృత్‌సర్‌లోని శ్రీ రామ్ ఆశ్రమ్ పాఠశాలకు చెందిన విద్యార్థి ముదిత్ జైన్, తన పాఠశాలకే కాకుండా తన కుటుంబానికి, రాష్ట్రానికి కూడా గర్వకారణంగా నిలిచాడు. ఆ విజయంతో పాఠశాలలో సంబరాలు మిన్నంటాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్? సిబ్బంది కలిసి స్వీట్లు పంచిపెట్టి ముదిత్‌ను అభినందించారు.తాజాగా వచ్చిన ఫలితాలతో తన కష్టానికి తగిన ఫలితం లభించిందని ముదిత్ హర్షం వ్యక్తం చేశాడు. తాను ఫలితాలు చూసిన తర్వాత చాలా సంతోషించాడని మదిత్ అన్నాడు. ప్రతిరోజు క్రమం తప్పకుండా చదవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఇటువంటి మంచి రిజల్ట్స్ వచ్చాయని చెప్పాడు. నిరంతరం తనకు మద్దతు ఇచ్చిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశాడు.పాఠశాల ప్రిన్సిపల్ వినోదిత మాట్లాడుతూ, "వంద శాతం మార్కులు సాధించడం ఒక గొప్ప విజయం. ఇది ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుంది. ముదిత్ చదువులో ప్రతిభావంతుడు మాత్రమే కాకుండా, పాఠశాలలోని ఇతర కార్యకలాపాలలో కూడా చురుకుగా పాల్గొంటాడు" అని అన్నారు. ముదిత్ తల్లిదండ్రులు పరుల్ గుప్తా, రజనీష్ జైన్, ఇది తమ కుటుంబానికి అత్యంత ప్రత్యేకమైన రోజు అని పేర్కొన్నారు. అలాగే తమ కుమారుడి విజయంపై గర్వంగా ఉందని చెప్పారు. ముదిత్ తన లక్ష్యం కోసం నిరంతరం కష్టపడ్డాడని తన తల్లి అన్నారు. కోటక్ మహీంద్రా బ్యాంకులో పనిచేస్తున్న ముదిత్ తండ్రి, తన కుమారుడు ఇంజనీర్ అయి మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని తాను ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఒడిశాలోని పూరీలో ఉన్న మదర్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని టీనా రథ్ కూడా వంద శాతం మార్కులు సాధించింది. ఆ పాఠశాల వ్యవస్థాపకుడు పాలి పట్నాయక్ పీటీఐతో మాట్లాడుతూ, ఆరు సబ్జెక్టులకు టీనా గణితంలో 100కి 99 మార్కులు, మిగిలిన ఐదు సబ్జెక్టులలో పూర్తి మార్కులు (100) సాధించిందని తెలిపారు. "సీబీఎస్ఈ నిబంధనల ప్రకారం, అత్యుత్తమంగా రాణించిన ఐదు సబ్జెక్టులను పరిగణనలోకి తీసుకుంటారు. అందుకే ఆమె 500 మార్కులు సాధించింది" అని పట్నాయక్ అన్నారు.కార్డియాక్ సర్జన్ అవ్వాలని కలఐటీ నిపుణులైన సమీర్ కుమార్ రాథ్, రేణు ప్రభా దాస్‌ల పెద్ద కుమార్తె టీనా. తాను రోజూ సుమారు 10-12 గంటలు చదువుకునేదని చెప్పింది. "నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నాకు నిరంతరం అండగా నిలిచారు. నేను కార్డియాక్ సర్జన్ కావాలనుకుంటున్నాను" అని ఆమె అన్నారు. టానా తండ్రి ఆమె సాధించిన విజయానికి గర్వపడుతున్నారని తెలిపారు. తన కలలకు కుటుంబం పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. ఆమెను 12వ తరగతి కోసం భువనేశ్వర్‌కు పంపించే ప్రణాళికలు ఉన్నాయని, నీట్ పరీక్షకు సిద్ధం కావడానికి అవసరమైన అన్ని సహాయాలు చేస్తామని

## మహిళా సాధికారతకు చరిత్రాత్మక అడుగు వేసేందుకు సిద్ధం




**న్యూ ఢిల్లీ :** మహిళా సాధికారత దిశగా దేశం కీలక ము ందడుగు వేయబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. తల్లులు, సోదరీ మణులకు ఇచ్చే గౌరవమే దేశానికి మనం ఇచ్చే గౌరవమని అన్నారు. మూడు రోజుల పాటు పార్లమెంట్‌లో జరగనున్న ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టనున్న సందర్భంగా ప్రధాని మోదీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.'ఈరోజు నుంచి పార్లమెంటులో ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ ప్రత్యేక సమావేశాల్లో దేశం మహిళా సాధికారతకు చారిత్రాత్మక అడుగు వేయబోతోంది. తల్లులు, సోదరీమణుల గౌరవమే దేశ గౌరవం. అదే భావంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది' అని ప్రధాని మోదీ పోస్ట్?లో రాసుకొచ్చారు.డీలిమిటేషన్‌పై అపోహలు వద్దు : కిరణ్ రిజిజుమరోవైపు ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లుపై విపక్షాలు అపోహలు, తప్పుడు ప్రచారం చేయవద్దని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ అమలు లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొస్తున్న చట్టాన్ని తప్పుగా అర్థం చేసుకోవద్దని ఆయన విపక్షాలకు సూచించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన రిజిజు, డీలిమిటేషన్ పేరుతో మహిళా రిజర్వేషన్‌కు అడ్డంకులు సృష్టించడం సరైంది కాదని అన్నారు. దక్షిణ భారత రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టించవద్దని ఆయన వ్యాఖ్యానించారు.సీట్ల పెంపు ప్రతిపాదన2023లో ఆమోదం పొందిన 'నారీ శక్తి వందన్ అధినియం' అమలుకు సంబంధించి ప్రభుత్వం కీలక సవరణలు తీసుకువస్తోంది. ఇందులో భాగంగా లోక్‌సభ స్థానాలను ప్రస్తుత 543 నుంచి గరిష్ఠంగా 850 వరకు పెంచే ప్రతిపాదన ఉంది. ఈ మార్పుల ద్వారా 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. జనాభా లెక్కల ఆధారంగా డిలిమిటేషన్ నిర్వహించి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సీట్ల సంఖ్యను పెంచే ప్రతిపాదన ఉంది. రొటేషన్ పద్ధతిలో నియోజకవర్గాలను మహిళలకు కేటాయించనున్నట్లు బిల్లులో పేర్కొన్నారు.దీని ద్వారా మహిళల రాజకీయ ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మహిళా రిజర్వేషన్ తక్షణ అమలు, నియోజకవర్గాల పునర్విభజన, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు ఈ మూడు బిల్లులను కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. పార్లమెంట్ ఉభయ సభలు మూడు రోజుల్లో మూడు బిల్లులపై చర్చించి ఆమోదించనున్నాయి. వీటి ఆమోదం కోసం కేంద్రం బడ్జెట్ సమావేశాలను పొడిగించింది. బిల్లులోని ప్రతిపాదన ప్రకారం లోక్‌సభలో 1/3 వంతు సీట్లు అంటే మొత్తం 816 లోక్‌సభ స్థానాల్లో మహిళలకు దాదాపు 273 సీట్లను కేటాయించేలా చట్టంలో సవరణలు చేయనున్నారు. డీలిమిటేషన్‌పై విపక్షాల తీవ్ర అభ్యంతరంప్రతిపక్షాలు ఈ ప్రతిపాదనలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఉన్నప్పటికీ, ప్రస్తుత విధానం వెనుక వేరే ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. ఇది మహిళా రిజర్వేషన్ కాదని, డీలిమిటేషన్ పేరుతో అధికార కేంద్రీకరణకు ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఓబీసీ, దళిత, ఆదివాసీ వర్గాల హక్కులను దెబ్బతీసే ప్రయత్నమని వ్యాఖ్యనించారు. తాజా జనగణన ఆధారంగా కాకుండా పాత 2011 డేటాను ఉపయోగించడం ద్వారా చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ఆయన విమర్శించారు.

## మా అభిప్రాయాన్ని ముందే చెప్పాం.. రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై సోనియా గాంధీ



**న్యూ ఢిల్లీ :**మహిళల రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గ పునర్విభజన బిల్లులపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తాజాగా స్పందించారు. మీడియా ప్రతి నిధుల ప్రశ్నలకు స్పందిస్తూ తమ పార్టీ వైఖరిని ముందే తెలియజేశామని అన్నారు. ఈ విషయ ంలో అదనంగా తాను చెప్పాల్సిందేమీ లేదని పేర్కొన్నారు.ఇందుకు సంబంధించిన బిల్లులను నేడు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్ వాల్, హోం మంత్రి అమిత్‌షా లోక్‌సభ ముం దుకు తీసుకొచ్చారు. 131వ రాజ్యంగసవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను మంత్రి మేఘ్‌వా ల్ ప్రవేశపెట్టగా, కేంద్రపాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాలకు సంబంధించిన బిల్లును అమిత్ షా సభ ముందు పెట్టారు. బిల్లులను అనుమతించాలా? వద్దా? అన్న అంశంపై ఓటింగ్ జరగ్గా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వ్టశారు. ఈ బిల్లులపై 12 గంటల పాటు చర్చ జరగనుంది. అవసరమైతే సమయాన్ని స్పీకర్ పొడిగిస్తారని కేంద్రం పేర్కొంది.

## టెహ్రాన్‌లో అసిమ్ మునీర్.. అణ్వస్త్ర అంశాలపై ఇంకా ప్రతిష్టంభన



**వాషింగ్టన్:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ప్రస్తుతం ఇరాన్()లో పర్యటిస్తున్నారు. టెహ్రాన్‌లో ఆయన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగాచితో భేటీ అయ్యారు. అయితే అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తలను తగ్గించే నేపథ్యంలో అసిమ్ మునీర్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే యుద్ధం విషయంలో ఇరాన్, అమెరికా మధ్య కొన్ని అంశాల్లో అగ్రిమెంట్ కుదిరింది. రెండు వారాల సీజ్‌ఫైర్ నేపథ్యంలో ఇంకా కొన్ని తేలని అంశాలు ఉన్నాయి. ఇరాన్ చేపట్టే అణ్వస్త్ర కార్యక్రమాల గురించి రెండు దేశాల మధ్య ఒడంబడిక కుదరలేదని ఓ సీనియర్ ఇరానీ అధికారి తెలిపారు. అసిమ్ మునీర్ రాక వల్ల అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన కొంత తగ్గినట్లు ఓ అధికారి చెప్పారు.

## 40ఏళ్లుగా ఇజ్రాయెల్ యుద్ధం కోసం ప్రయత్నిస్తోంది



**ఇరాన్ :**పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై ఇరాన్ సుప్రీం లీడర్ భారత ప్రతినిధి డా. అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితిని వ్యక్తిగత యుద్ధంగా అభివర్ణిస్తూ, ఇజ్రాయెల్ నాయకత్వం చాలా కాలంగా ఇరాన్‌పై సైనిక చర్యలకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బుధవారం జైపుర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ దశాబ్దాలుగా ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభి ంచాలని కోరుకున్నారని తెలిపారు.వ్యక్తిగత యుద్ధంగా భావిస్తున్నాం!' ఇజ్రాయెల్ ప్రధాని గత 40 ఏళ్లుగా ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారం భించాలనే ఆలోచనతో ఉన్నారు. అయితే గతంలో అమెరికా అధ్యక్షులను ఒప్పించలే కపోయారు. ఈసారి మాత్రం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఒప్పించగలిగారు. అందుకే ఈ యుద్ధాన్ని వ్యక్తిగత యుద్ధంగా మేము భావిస్తున్నాం' అని ఇలాహీ వ్యాఖ్యానించారు.40 రోజుల్లో వారు ఏ లక్ష్యాన్నీ సాధిం చలేకపోయారు!ప్రస్తుత ఘర్షణలో వ్యవహారశైలిపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభం నుంచే చర్చలపై వారు నిజాయితీగా లేరని ఇరాన్ భావించిందని చెప్పారు. "వారు చర్చలకు సీరియస్‌గా లేరని మేము మొదటి నుంచే చెప్పాము. మా దేశంపై దాడులు చేశారు. పౌరులను చంపారు. ఇళ్లు, ఆస్పత్రులు, విశ్వవిద్యాలయాలు వంటి ప్రజా వనరులను ధ్వంసం చేశారు. కానీ 40 రోజుల్లో వారు ఏ లక్ష్యాన్నీ సాధించలేకపోయారు" అని అన్నారు.యుద్ధం ద్వారా సాధించలేని లక్ష్యాలను చర్చల ద్వారా సాధించాలనే ప్రయత్నం జరుగుతోందని కూడా ఇలాహీ పేర్కొన్నారు. 'యుద్ధంతో సాధించలేనిదాన్ని చర్చల ద్వారా సాధించాలని వారు ప్రయత్నించారు. కానీ అది కూడా సాధ్యం కాదని వారికి అర్థమైంది. వారు ప్రతి విషయాన్ని వ్యాపారంలా చూస్తున్నారు' అని విమర్శించారు.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

# చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా ?

అంబేద్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిడిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేద్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మండి మాద్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్ధతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ధ ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఎ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం



అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనను 2029 సార్వత్రక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది.

2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీ లిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్దంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యేలుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.


## దేశాన్ని నిర్మించే దిశగా 'శక్తి' స్ఫూర్తితో సాగాలి



### మహిళా బిల్లు నేపథ్యంలో పవన్ కళ్యాణ్ పోస్ట్


**అమరావతి,ఏప్రిల్16:** భారతదేశం ఈరోజు నారీ శక్తిని గౌరవిస్తూ దేశంలోని మహిళలు వివిధ రంగాల్లో సాధిస్తున్న అసాధారణ విజయాలను వేడుక చేసుకుంటోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పవన్ ఎక్స్ వేదికగా స్పందించారు. చెస్ బోర్డు నుంచి ఒలింపిక్ పోడియం వరకు భారతీయ మహిళలు దేశానికి స్ఫూర్తిని అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల సైప్రస్‌లో జరిగిన మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఆర్.వైశాలి చరిత్ర సృష్టించారని అన్నారు. ఈ టోర్నమెంట్ గెలుచుకుని, మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడే అర్హత సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచారన్నారు. ఈ విజయం భారత మహిళల ప్రపంచ స్థాయి ప్రతిభను మరోసారి నిరూపించిందన్నారు. గౌరవనీయ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ బలోపేతం చేసిన పరిపాలన, ప్రజా సేవ నుంచి నారీ శక్తి ప్రయాణం.. భారత అంతరిక్ష యాత్రల్లో రితు కరిధాల్ ప్రదర్శించిన శాస్త్రీయ నైపుణ్యం వరకు విస్తరించిందన్నారు. అలాగే ప్రపంచ బాక్సింగ్ వేదికపై ఆధిపత్యం చెలాయించి దేశ గౌరవాన్ని నిలబెట్టిన నిఖత్ జరీన్ క్రీడా నైపుణ్యం కూడా.. ఈ సాధికారత ప్రయాణం భారతదేశ రాజ్యాంగ పునాదులలో లోతుగా పాతుకు పోయిందని చెప్పారు. దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మి పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి రాజ్యాంగ వ్యవస్థాపక మాతృమూర్తులు ఈ పునాదులను తీర్చిదిద్దారన్నారు. వారి కృషి తరతరాల భారతీయ మహిళలకు న్యాయం, సమానత్వాన్ని అందించిందని పవన్ పేర్కొన్నారు. ప్రతిభకు అవకాశం లభిస్తే మహిళలు నాయకత్వం వహిస్తారని, రాణిస్తారని, దేశాలకు స్ఫూర్తినిస్తారని చరిత్ర చెబుతోందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ స్ఫూర్తితోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'నారీ శక్తి వందన అధినియమ్' సవరణ బిల్లు 2026ను ప్రవేశపెట్టారని తెలిపారు. శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా పరిపాలనలో వారికి న్యాయమైన స్థానం కల్పించే దిశగా ఇది చరిత్రాత్మక అడుగుగా నిలుస్తుందన్నారు. జనసేన పార్టీ మహిళా సాధికారత కోసం కేవలం మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ దృఢంగా నిలబడిందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే నిబద్ధత, సమాన అవకాశాలు, న్యాయమైన ప్రాతినిధ్యం పట్ల జనసేనకు ఉన్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తుందని తెలిపారు. మహిళలే సమాజానికి పునాది అని... కుటుంబాలను పోషించడం నుంచి దేశాన్ని తీర్చిదిద్దడం వరకు వారి పాత్రకు ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ఒక మహిళ ఉన్నత స్థాయికి ఎదిగితే దేశం కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇది కొత్త హక్కులు ప్రసాదించడం కాదని.. మహిళలకు న్యాయబద్ధంగా చెందాల్సిన వాటిని పునరుద్ధరించడమే అని స్పష్టం చేశారు. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను, బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయన్నారు. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదంగా మిగిలి పోదని.. అది మన నాగరికతకు బలమైన శక్తిగా నిలుస్తుందన్నారు. న్యాయబద్ధమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించే దిశగా 'శక్తి' స్ఫూర్తితో ముందుకు సాగాలి అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు




### రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
### భానుడి భగభగలతోఇంటికే పరిమితం అయిన జనం
### పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

**హైదరాబాద్,ఏప్రిల్16:** ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగా కొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతా యని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది. వడగాలులు సాధారణ రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలు పలు ప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో కనీసం ఐదుగురు వడగాల్పులకు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో



డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలా రక్షించుకోవాలో, సూచిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికం గా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసేపు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడంవంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40-45 డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది. గడచిన పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో సగటు గరిష్టఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి.విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతున్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్ప వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఎల్నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది.



# కోహ్లీని ఆశ్చర్యపరిచిన మయాంక్ యాదవ్

క్రికెట్ మైదానంలో పోటీ ఎంత తీవ్రంగా ఉన్నా, ఆటగాళ్ల మధ్య ఉండే గౌరవం ఆటకు అసలైన అందాన్ని తెస్తుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా బుధవారం రాత్రి ఎం. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో అటువంటి ఒక అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ యువ ప్లేయర్ చేసిన ఒక పని, విరాట్ కోహ్లీని సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. లక్నో సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 147 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీకి విరాట్ కోహ్లీ (49 పరుగులు, 34 బంతులు) అద్భుతమైన పునాది వేశారు. తన క్లాసిక్ షాట్లతో చిన్నస్వామి స్టేడియాన్ని హోరెత్తించిన కోహ్లీ, కేవలం ఒక పరుగు దూరంలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నారు. అయితే, ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్న తర్వాత, మైదానంలో ఆటగాళ్లందరూ ఒకరినొకరు అభినందించుకుంటున్న సమయంలో ఒక విశేషం జరిగింది. లక్నోకు చెందిన ఒక యువ ఫాస్ట్ బౌలర్ (వార్తల ప్రకారం మయాంక్ యాదవ్ లేదా యువ పేసర్ మయుక్ చౌదరి) విరాట్ కోహ్లీ దగ్గరికి వెళ్లి, ఆయన పట్ల ఎంతో వినయాన్ని ప్రదర్శించారు. కోహ్లీని ఒక లెజెండ్‌గా భావించే ఆ యువ బౌలర్, కోహ్లీ దగ్గరికి వచ్చి ఆయన ఆశీర్వాదం తీసుకున్నట్లుగా ప్రవర్తించడమే కాకుండా, వికెట్ల మధ్య కోహ్లీ వేగం మరియు ఫిట్‌నెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ హఠాత్పరిణామానికి కోహ్లీ కాసేపు ఆశ్చర్యపోయినా, వెంటనే ఆ యువ ఆటగాడిని ఆత్మీయంగా హత్తుకుని మెచ్చుకున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు విరాట్ కోహ్లీ చీలమండ గాయంతో ఇబ్బంది పడుతున్నట్లు వార్తలు వచ్చాయి. అందుకే ఆయన ఈ మ్యాచ్‌లో 'ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్'గా బరిలోకి దిగారు. ఫీల్డింగ్ చేయకపోయినా, బ్యాటింగ్ సమయంలో ఆయన క్రీజులో పరిగెత్తిన తీరు చూస్తుంటే ఎక్కడా గాయం లక్షణాలు కనిపించలేదు. ఆ యువ బౌలర్ కూడా ఇదే విషయాన్ని కోహ్లీతో చర్చిస్తూ, "మీ ఎనర్జీ లెవల్స్ చూస్తుంటే మాకే ఆశ్చర్యంగా ఉంది" అని అన్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ బౌలర్లు రసిక్ సలాం (4/24), భువనేశ్వర్ కుమార్ (3/27) అద్భుత ప్రదర్శనతో లక్నోను 146 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం కోహ్లీ 49 పరుగులతో మెరవగా, చివర్లో రజత్ పాటిదార్ (27), జితేష్ శర్మ (23) మెరుపులు మెరిపించి ఆర్‌సీబీకి సునాయాస విజయాన్ని అందించారు. కేవలం 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు, తమ రన్ రేట్‌ను భారీగా మెరుగుపరుచుకుని టేబుల్ టాపర్‌గా నిలిచింది.

# వరల్డ్ టైటిల్ రేసులో వైశాలి

చెస్ ప్రపంచంలో భారత యువ కెరటం వైశాలి రమేష్ బాబు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఉత్కంఠభరితంగా సాగిన మహిళల కాండిడేట్స్ టోర్నమెంట్ 2026లో విజేతగా నిలిచి ప్రపంచ ఛాంపియన్ టైటిల్ కోసం జూ వెన్‌జున్‌తో తలపడే అవకాశాన్ని దక్కించుకుంది. ఆఖరి రౌండ్లో రష్యా క్రీడాకారిణి కటెరినా లగ్నోపై అద్భుత విజయం సాధించిన వైశాలి రమేష్ బాబు.. మొత్తం 14 రౌండ్లలో 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. దీంతో ప్లే-ఆఫ్స్ అవసరం లేకుండానే ఆమెను విజేతగా ప్రకటించారు. టోర్నీ ఆరంభంలో తక్కువ రేటింగ్ కలిగిన క్రీడాకారిణిగా బరిలోకి దిగిన వైశాలి, అసాధారణ ప్రతిభను కనబరిచింది. చివరి రౌండ్ మొదలయ్యే సమయానికి ఆరుగురు క్రీడాకారిణులు రేసులో ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే వైశాలి తన ప్రత్యర్థి లగ్నోను తెలివిగా ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఆమె తన రేటింగ్‌ను 26 పాయింట్ల వరకు పెంచుకోవడమే కాకుండా, తన కెరీర్‌లో అత్యుత్తమ మైలురాయిని చేరుకుంది. మరోవైపు బిబిసార అసౌబాయేవా తన చివరి గేమ్‌లో దివ్య దేశ్‌ముఖ్‌తో డ్రా చేసుకుని రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఝూ జిన్నర్, అలెగ్జాండ్రా గోర్యాచ్కినా సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. వైశాలి గెలుపుపై భారత చదరంగ



దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. "వైశాలి అద్భుతమైన సన్నద్ధతను, పట్టుదలను ప్రదర్శించింది. కష్టాలను ఎదుర్కొని విజయాన్ని అందుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారతీయులు ఉండటం గర్వకారణం" అని ఆయన ప్రశంసించారు. వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీలో శిక్షణ పొందిన వైశాలికి ఈ విజయం చాలా ప్రత్యేకం. గతంలో గ్రాండ్ స్విస్ టైటిళ్లను గెలుచుకున్న వైశాలి, ఇప్పుడు ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్ బెల్టుపై కన్నేసింది. చెన్నైకి చెందిన ఈ యువ గ్రాండ్ మాస్టర్, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తిని మరోసారి ఇనుమడింపజేసింది. రాబోయే టైటిల్ పోరులో ఆమె జూ వెన్‌జున్‌కు గట్టి పోటీనిస్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



# ముకుల్ చౌదరికి కృనాల్ పాండ్యా వార్నింగ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నిన్న బుధవారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ గెలుపొంది.. ఐపీఎల్ పాయింట్ల పట్టికలో తొలిస్థానానికి ఎగబాకింది. అయితే ఈ మ్యాచ్ జరుగుతున్న తొలి ఇన్నింగ్స్ అనగా లక్నో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం జరిగింది. లక్నో బ్యాటర్ ముకుల్ చౌదరితో ఆర్సీబీ లెగ్ స్పిన్నర్ కృనాల్ పాండ్యా మధ్య వివాదం చెలరేగింది. కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో ముకుల్ చౌదరి ఓ పవర్ ఫుల్ షాట్ కొట్టగా.. అదే సమయంలో వారిద్దరి మధ్య మాటలు జారినట్లు తెలుస్తోంది. అయితే కెమెరాలో ఆర్సీబీ స్పిన్నర్ కృనాల్ పాండ్యా కోపంతో అరుస్తున్నట్లు చూపించారు. కానీ, వారిద్దరి మధ్య ఏం జరిగిందనే విషయం తెలియరాలేదు. అయితే పిచ్‌లో ఉండే వికెట్ మైక్స్ వారి మాటలను రికార్డు చేశాయి. బౌండరీ తర్వాత కృనాల్ పాండ్యా స్లెడ్జింగ్‌కు పాల్పడినట్లు తెలిసింది. ముకుల్ చౌదరి మొదట కొట్టిన భారీ షాట్ తర్వాత.. కృనాల్ పాండ్యా ఆ బ్యాటర్‌ను స్లెడ్జింగ్ చేస్తూ, మరోసారి అదే షాక్ ఆడమని సవాలు విసిరాడు. క్రీజ్‌లో మానసిక ఒత్తిడిని కలిగించే ప్రయత్నంలో, పాండ్యా తర్వాతి బంతినే కొట్టమని చౌదరిని స్పష్టంగా సవాలు చేశాడు. అదే విధంగా తన తర్వాతి బాల్‌లో కూడా బౌండరీతో ముకుల్ అలరించాడు. ఆ షాట్ తర్వాత ముకుల్ పాండ్యాతో నేరుగా కళ్ళలోకి చూస్తూ, తాను సవాలును స్వీకరించానని చెప్పాడు. తన తర్వాతి ఓవర్‌లో బ్యాటర్ వికెట్ తీస్తానని పాండ్యా శపథం చేయడంతో ఈ వాగ్వాదం కొనసాగింది. టీ20 క్రికెట్ మ్యాచ్ టెన్షన్ వాతావరణంలో స్లెడ్జింగ్ లేదా ఇరు టీమ్స్ సవాళ్లు సాధరణమైనా.. అయితే అందుకు కొంత హద్దు ఉంది. ప్రస్తుతం వీరిద్దరి వాగ్వాదం ఇప్పుడు ఐపీఎల్ నిర్వహణ అధికారుల వద్దకు చేరింది. క్రికెట్ స్ఫూర్తిని కాపాడేందుకు ఆటగాళ్ల ప్రవర్తన మరియు మైదానంలో దూకుడుకు సంబంధించి ఐపీఎల్ పాలక మండలి కఠినమైన మార్గదర్శకాలను పాటిస్తుంది. పరిస్థితి శారీరక ఘర్షణగా మారకుండా నివారించడానికి, స్టేడియంలో ఉన్న అంపైర్లు ఆటగాళ్లను నిశితంగా గమనిస్తూ కనిపించారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి మ్యాచ్ రిఫరీ నుండి వచ్చే ఏవైనా తదుపరి నివేదికల వల్ల, సంబంధిత ఆటగాళ్లకు జరిమానాలు లేదా అధికారిక హెచ్చరికలు విధించే అవకాశం ఉంది.



# రిషబ్ పంత్ ఎడమ మోచేతికి గాయం

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా బుధవారం ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లో ఒక ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఎల్ఎస్‌జీ కెప్టెన్ రిషబ్ పంత్ బ్యాటింగ్ చేస్తూ తీవ్రంగా గాయపడ్డాడు. మూడవ ఓవర్‌లోనే ఎయిడెన్ మార్క్రమ్ అవుట్ అవ్వడంతో క్రీజులోకి వచ్చిన పంత్, జోష్ హాజిల్‌వుడ్ వేసిన నాలుగో ఓవర్‌లో ఇబ్బంది పడ్డాడు. హాజిల్‌వుడ్ సంధించిన ఒక షార్ట్ డెలివరీని భారీ షాట్ ఆడబోయిన క్రమంలో బంతి నేరుగా పంత్ ఎడమ మోచేతికి బలంగా తగిలింది. ఆ దెబ్బకు పంత్ విపరీతమైన నొప్పితో మైదానంలోనే విలవిలలాడిపోయాడు. ఫిజియో వచ్చి ప్రాథమిక చికిత్స చేసినప్పటికీ పంత్ నొప్పి తగ్గలేదు. ఆ బాధ భరించలేక అతను కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారందరినీ కలిచివేసింది. బ్యాటింగ్ కొనసాగించలేక రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగే ముందు, తన వాచిన మోచేతిని బౌలర్ హాజిల్‌వుడ్‌కు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు. పంత్ మైదానాన్ని వీడటంతో లక్నో క్యాంప్‌లో ఆందోళన మొదలైంది. అయితే, తన జట్టు కోసం పంత్ అద్భుతమైన పోరాట పటిమను కనబరిచాడు. 16వ ఓవర్‌లో ఆయుష్ బదోని అవుట్ అయిన తర్వాత, తన ఎడమ చేతికి భారీగా బ్యాండేజ్ కట్టుకుని మళ్ళీ క్రీజులోకి వచ్చాడు. తన ఆరోగ్యం కంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని పంత్ నిరూపించాడు. అయితే ఒక్క పరుగుకే వెనుదిరగడం ఫ్యాన్స్ కు నిరాశ కలిగించినా, అతని ఫైటింగ్ స్పిరిట్ ను అంతా మెచ్చుకుంటున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు లక్నో ఓపెనర్ మిచెల్ మార్ష్ బ్రాడ్‌కాస్టర్లతో మాట్లాడుతూ టీ20 క్రికెట్ మారుతున్న తీరుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.



# సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు ధోనీ దూరం!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ లీగ్‌లో ఏకంగా 5 సార్లు ట్రోఫీ ని గెలుచుకొని..మోస్ట్ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీగా నిలిచింది. కానీ, గత రెండు సీజన్లుగా చెన్నై సూపర్ కింగ్స్ లీగ్ దశలో మ్యాచ్ గెలిచేందుకే తీవ్రంగా శ్రమిస్తోంది. కొన్ని సందర్భాల్లో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగుభాగన ఉండి ట్రోల్స్ కు గురవుతోంది. అయితే చెన్నై గెలుపులోనూ ధోనీ ఉండగా.. ఇప్పుడు టీమ్‌లో ధోనీ లేకపోవడమే జట్టు వైఫల్యానికి ప్రధాన కారణమని ఫ్యాన్స్ అంటున్నారు. ఈ సీజన్‌లో గాయం కారణంగా రెండు వారాల పాటు దూరమైన మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. లేకపోవడం చెన్నై టీమ్ వైఫల్యానికి కారణంగా తెలుస్తోంది. దీంతో ధోనీ ఎప్పుడొస్తాడని సీఎస్కే టీమ్ సహా అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే శనివారం ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్‌లో ధోనీ ఆడబోతున్నాడనే వార్తలు వచ్చాయి. కానీ, ఈ మ్యాచ్‌కు కూడా ధోనీ అందుబాటులో ఉండడం లేదని సమాచారం. సీఎస్కే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. ఏప్రిల్ 23న వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగే ఐపీఎల్ 2026 మ్యాచ్‌లో అందుబాటులో ఉంటాడని తాజా సమాచారం. పిక్క కండరాల గాయం కారణంగా ఆరంభ మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. ధోనీ లేకుండా చెన్నై ఆడిన మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 3 ఓటములతో సతమతమవుతోంది. అయితే సీఎస్కే తరువాతి మ్యాచ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఏప్రిల్ 18న జరగనుంది. అయినా కూడా ఏప్రిల్ 23న ముంబై ఇండియన్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడనున్నాడని తెలుస్తోంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం.. సీఎస్కే వర్గాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం ధోనీ పూర్తి ఫిట్‌నెస్‌కు దగ్గరగా ఉన్నాడు. 2011 వన్డే ప్రపంచ కప్ టైటిల్‌ను భారత్‌కు అందించిన వాంఖడే మైదానంలో జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో ఐదు మ్యాచ్‌లలో రెండు విజయాలతో సీఎస్కే ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇటీవలే కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో మ్యాచ్‌కు ముందు, ధోనీ సీఎస్కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీతో కలిసి శిక్షణ తీసుకున్నాడు. కానీ, అతను మైదానంలోకి రాలేదు.

# ముంబై ఇండియన్స్‌లోకి క్రిష్ భగత్

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. గాయం కారణంగా టోర్నీకి దూరమైన యువ ఆటగాడు అథర్వ అంకోలేకర్ స్థానంలో క్రిష్ భగత్ అనే కొత్త కుర్రాడిని జట్టులోకి తీసుకుంది. సీజన్ ప్రారంభానికి ముందే అంకోలేకర్ మోకాలి గాయంతో తప్పుకోగా, నాలుగు మ్యాచ్‌ల తర్వాత ముంబై మేనేజ్‌మెంట్ ఈ రీప్లేస్‌మెంట్‌ను అధికారికంగా ప్రకటించింది. నేడు పంజాబ్ కింగ్స్‌తో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందే ఈ మార్పు చోటుచేసుకోవడం విశేషం. 21 ఏళ్ల క్రిష్ భగత్ రైట్ హ్యాండ్ ఆల్‌రౌండర్. ఇతడు దేశవాళీ క్రికెట్‌లో పంజాబ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. క్రిష్ ఒక మంచి పేస్ బౌలర్ మాత్రమే కాదు, లోయర్ ఆర్డర్‌లో వచ్చి భారీ షాట్లు ఆడగల సమర్థుడు. గత రెండేళ్లుగా ఇతడు ముంబై ఇండియన్స్ ట్రయల్స్‌లో పాల్గొంటున్నాడు. ఈ ఏడాది జరిగిన డివై పాటిల్ టీ20 కప్‌లో రిలయన్స్ జట్టు తరపున ఆడి తన ప్రతిభను చాటుకున్నాడు. క్రిష్ భగత్ ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం నుంచి ముంబై ఇండియన్స్ జట్టుతో ఒక సపోర్ట్ బౌలర్‌గా ప్రయాణిస్తున్నాడు. ప్రాక్టీస్ సెషన్లలో, ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో ఇతడు వేసిన బంతులకు కోచింగ్ స్టాఫ్ ఫిదా అయిపోయారు. "క్రిష్ చూపించిన అంకితభావం, కష్టపడే తత్వం మమ్మల్ని ఆకట్టుకున్నాయి. అందుకే అతడిని ప్రధాన జట్టులోకి తీసుకున్నాం" అని ముంబై ఇండియన్స్ ఒక ప్రకటనలో తెలిపింది.



శుక్రవారం , ఏప్రిల్ 17 , 2026

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక




# మంగ లేకపోతే తిరుపతి వదిలివెళ్లే ప్రసక్తే లేదు

## రమేశ్‌బాబు తనయుడు తెరంగేట్రం

## జయకృష్ణ హీరోగా శ్రీనివాసమంగాపురం

మంగ లేకపోతే తిరుపతి వదిలివెళ్లే ప్రసక్తే లేదు అంటున్నాడు శ్రీను. ఎంతగానో ప్రేమించిన మంగ తనది కాదు అని తెలిసిన క్షణం శ్రీను ఏ నిర్ణయం తీసుకున్నాడో తెలియాలంటే 'శ్రీనివాస మంగాపురం' చూడాల్సిందే. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరురుడ రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. అజయ్ భూపతి దర్శకుడు. అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ సమర్పణలో... చందమామ కథలు పిక్చర్స్ పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ కథానాయకుడు మహేశ్‌బాబు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. 'ఈ క్షణం ఇప్పటికిప్పుడు నీకేమనిపిస్తుంది... నేనస్సలు నీ ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్నానా?' అంటూ కథానాయకుడు అడగ్గా, టాప్ టెన్‌లో ఉంటావులే... అంటూ కథానాయిక ఇచ్చే సమాధానంతో టీజర్ మొదలవుతుంది. శ్రీను, మంగా అనే యువ జంట చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. 'అందమైన జంట, ఆకట్టుకునే ప్రేమకథ, హత్తుకునే భావోద్వేగాలు, అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కుతోన్న చిత్రమిది. తిరుపతి నేపథ్యం సినిమాకి మరింత కొత్తదనాన్ని తీసుకొచ్చింద'ని సినీవర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: జయకృష్ణ, కూర్పు: మాధవ్ కుమార్ గుళ్లపాటి, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్.




# వరుణ్ తేజ్ మోకాలికి శస్త్రచికిత్స...

## పవన్ కల్యాణ్ స్పందన

యువ హీరో వరుణ్ తేజ్ త్వరగా కోలుకోవాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. 'బరి' సినిమా కోసం ప్రాక్టీస్ చేస్తుండగా వరుణ్ తేజ్ తీవ్రంగా గాయపడగా ఆయన మోకాలికి శస్త్రచికిత్స జరగడం తెలిసిందే. దీనిపై పవన్ స్పందించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు."యువ కథానాయకుడు వరుణ్ తేజ్ 'బరి' చిత్రం కోసం ప్రాక్టీస్ చేస్తుండగా గాయపడి మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారని తెలిసింది. ఆయన త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. వైద్యులు, ఫిజియోథెరపిస్టుల సలహాలు పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ కెమెరా ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.ప్రస్తుతం వరుణ్ తేజ్ వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారు.






# స్వయంభూ నుంచి రారా ధీవర పాట ప్రోమో విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' పాటకి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. దీనికి సంబంధించిన ఫుల్ పాటను ఈరోజు సాయంత్రం 6.03 గంటలకు విడుదల చేయబోతున్నట్లు తెలిపింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.

# సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ..ఏక్‌దిన్


స్టార్ బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఏక్ దిన్'. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హీరోయిన్ (సాయి పల్లవి) ఇందులో ఒక అరుదైన వ్యాధితో బాధపడుతుంటుంది. అయితే తనను ప్రేమించిన హీరో (జునైద్) అమెతో ఒక్కరోజు అయిన ప్రేమతో గడపాలని కోరుకుంటాడు. అయితే ఆ ఒక్క రోజు వారి జీవితాలను ఎలా మార్చేసింది అనేది కథాంశం. తెలుగులో ఈ చిత్రం ఒక రోజు అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా.. అమీర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రామ్ సంపత్ సంగీతం అందిస్తున్నాడు. సాయి పల్లవి హిందీలో నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.




# తన ఫొటోలతో ప్రచారం చేసుకున్నారంటూ తమన్నా పిటిషన్.. కొట్టివేసిన హైకోర్టు

'పవర్ సోప్స్' కంపెనీపై ప్రముఖ సినీ నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి ఆమె తగిన సాక్ష్యాలు చూపలేకపోవడంతో న్యాయస్థానం పిటిషన్‌ను తోసిపుచ్చింది. బ్రాండ్ ప్రమోషన్స్‌కు సంబంధించి తమన్నా, పవర్ సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 2009 అక్టోబర్ వరకు తమన్నా ఫొటోలతో పవర్ సోప్స్ ప్రచారం చేసుకోవడానికి అనుమతి ఉంది.అయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010-2011 మధ్య ఈ సంస్థ తన ఫొటోలను అనుమతి లేకపోయినప్పటికీ ఉపయోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకు గాను తనకు రూ.1 కోటి పరిహారం నష్టపరిహారం ఇప్పించాలని కోర్టును ఆశ్రయించారు. అయితే ఇందుకు సంబంధించి సాక్ష్యాలు చూపలేదంటూ కోర్టు తమన్నా పిటిషన్‌ను కొట్టివేసింది.






# సింగరేణి నేపథ్యంలో సంయుక్త తాజా చిత్రం 'బ్లాక్ గోల్డ్'

టాలీవుడ్ 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్ తన తాజా చిత్రం 'బ్లాక్ గోల్డ్' షూటింగ్‌లో ఎదురైన సవాళ్లను వివరిస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. సినిమా తెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, దాని వెనుక చిత్ర యూనిట్ పడే శ్రమ ఎంతటిదో ఆమె పెట్టిన పోస్ట్ నిరూపిస్తోంది.

సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమా కోసం చిత్ర యూనిట్ మంచిర్యాలలో షూటింగ్ నిర్వహించింది. అక్కడ 40 నుంచి 45 డిగ్రీల తీవ్రమైన ఉష్ణోగ్రతల మధ్య పనిచేయడం తమను శారీరకంగా, మానసికంగా పరీక్షించిందని సంయుక్త పేర్కొంది. మండుతున్న ఎండలు, తీవ్రమైన అలసట వేధించినప్పటికీ చిత్ర బృందం ఎక్కడా వెనకడుగు వేయకుండా పనిచేసిందని ఆమె కితాబునిచ్చింది. డీహైడ్రేషన్ బారిన పడకుండా తన పర్సనల్ టీమ్ (నిహారిక, పార్థు) తీసుకున్న జాగ్రత్తలు, దర్శకుడు యోగి అందించిన ప్రోత్సాహం వల్లే ఈ కఠినమైన షెడ్యూల్‌ను పూర్తి చేయగలిగానని తెలిపింది.మంచిర్యాల షెడ్యూల్ ముగిసిన వెంటనే సంయుక్త నేరుగా తిరుమలకు చేరుకుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్న ఆమె, ఆ ప్రశాంతతలో దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఎంతటి ఒత్తిడిలో షూటింగ్ ప్రారంభించానో, అంతే ఉత్సాహంతో తిరిగి వస్తున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

# సందీప్ కిషన్ ...పవర్‌పేట

'పవర్ పేట'సినిమాపై గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. సందీప్ కిషన్ హీరోగా ఈ చిత్రం తెరకెక్కనుంది. సందీప్ యాక్టింగ్ కెరీర్‌కు 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కొత్త సినిమా పోస్టర్‌ను టీమ్ విడుదల చేసింది. చెస్ బోర్డుపై రక్తపు మరకలు, ఎర్ర గులాబీతో డిజైన్ చేసిన పోస్టర్ సినిమాపై ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ప్రేమ, గౌరవం, రాజకీయం ప్రధానాంశాలుగా ఈ సినిమా తెరకెక్కనున్నట్లు అర్థమవుతోంది. కృష్ణచైతన్య దర్శకత్వం వహించే ఈ చిత్రానికి మణిశర్మ మ్యూజిక్ డైరెక్టర్. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. హీరోయిన్, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ఓ ప్రియా ప్రియా, చిన్నదాన నీకోసం (ఇష్క్), గుండెజారి గల్లంతయ్యిందే తదితర హిట్ పాటలను రాసిన కృష్ణ చైతన్య 'రౌడీ ఫెలో'తో దర్శకుడిగా మారిన సంగతి తెలిసిందే. తర్వాత 'ఛల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' తెరకెక్కించారు. ఎప్పటినుంచో 'పవర్ పేట'పై చర్చ నడుస్తోంది. చైతన్య ముందుగా ఈ సినిమాని నితిన్‌తో తెరకెక్కిస్తున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో విశ్వక్‌సేన్ పేరు తెర పైకి వచ్చింది. దానిపైనా స్పష్టత రాకపోవడంతో.. సందీప్ కిషన్‌తో చేయనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఎట్టకేలకు ఇప్పుడు అనౌన్స్‌మెంట్ వచ్చింది.




Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888